


మహదేవపూర్ మండలం కాళేశ్వరం పుష్కరఘాట్ వద్ద గోదావరి ప్రవాహం



కాటారం మండలంలో ఉధృతంగా ప్రవహిస్తున్న బొర్రవాగు

బొగ్గు ఉత్పత్తికి అంతరాయం



మల్హర్ మండలం తాడిచర్ల ఓసీపీలోకి చేరిన వరద నీరు

భూపాలపల్లిటౌన్, జూలై 20: భూపాలపల్లి మండలంలోని సింగరేణి ఓపెన్‌కాస్టు 2, 3లలో వర్షం కారణంగా అధికనీరు చేరి బొగ్గు ఉత్పత్తికి అంతరాయం ఏర్పడింది. దీంతో 6,385 టన్నుల బొగ్గు ఉత్పత్తి ఆగిపోయింది. మల్హర్ మండలంలోని తాడిచర్ల బ్లాక్ ఓసీలోకి వర్షం నీరుచేరి 6 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తికి విఘాతం కలిగింది. మొత్తం బొగ్గు గనులకు సుమారు రూ.4.50 కోట్ల మేరకు నష్టం జరిగి ఉంటుందని సింగరేణి అధికారులు తెలిపారు.



బయ్యారం మండలంలో అలుగుపోస్తున్న బీఎస్ గుప్తా తులారాం ప్రాజెక్టు



కాటారం మండలం గంగపురిలో పెద్దవాగు పొంగి నీట మునిగిన వరిపంట

- మలుగు, మహబూబాబాద్ జిల్లాల్లో పొంగుతున్న వాగులు
- పలుచోట్ల నీటమునిగిన పంటలు, కూలిన చెట్లు
- రాకపోకలకు తీవ్ర అంతరాయం.. ఇబ్బంది పడ్డ జనం..
- రామప్ప, లక్నవరం, పాకాల చెరువులకు జలకళ
- గోదావరి నదికి పెరుగుతున్న ప్రవాహం
- బ్యారేజీలకు కొనసాగుతున్న వరద ఉధృతి
- భూపాలపల్లిలో బొగ్గు ఉత్పత్తికి అంతరాయం
- అప్రమత్తంగా ఉండాలంటున్న అధికారులు
- ఆయా జిల్లాల్లో టోల్‌ఫ్రీ నెంబర్ల ఏర్పాటు

ముసురుకుంది..

• ఉమ్మడి వరంగల్ జిల్లాలో విస్తారంగా వానలు •



20.9 అడుగులకు చేరిన పాకాల నీటిమట్టం

హనుమకొండ (ఆంధ్రజ్యోతి)/ మహబూబాబాద్ (ఆంధ్రజ్యోతి)/ జనగామ (ఆంధ్రజ్యోతి)/ ములుగు/ భూపాలపల్లి టౌన్ / వరంగల్ వ్యవసాయం, జూలై 20: అల్పపీడన ప్రభావంతో ఉమ్మడి వరంగల్ జిల్లావ్యాప్తంగా రెండురోజులుగా ఎడతెరిపి లేకుండా వాన కురుస్తోంది. శనివారం రోజంతా ముసురు కమ్మింది. ఉదయం నుంచి రాత్రి వరకు జల్లులు కురుస్తూనే ఉన్నాయి. శుక్రవారం అర్ధరాత్రి నుంచి శనివారం రాత్రి వరకు ఎడతెరిపి లేకుండా ముసురు వర్షం కురిసింది. దీంతో వివిధ పనుల నిమిత్తం బయటకు వెళ్లేవారు ఇబ్బందులు పడ్డారు. పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులకు, ఉద్యోగులకు కొంత అసౌకర్యం ఏర్పడింది. విస్తారంగా వర్షాలు కురుస్తుండటంతో వాగులు, వంకలు, చెరువులు, కుంటలు వరద నీటితో కళకళ లాడుతున్నాయి.

ములుగు జిల్లాలో 30 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. వానకు ఈదురుగాలులు తోడవ్వడంతో ఏటూరునాగారం-తాడ్వాయి, తాడ్వాయి-మేడారం ప్రధాన దారిలో చెట్లు విరిగిపడ్డాయి. దీంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పోలీసులు స్థానికుల సహకారంతో చెట్లను తొలగించి పునరుద్ధరించారు. మంగపేట, కన్నాయిగూడెం, ఏటూరునాగారం, తాడ్వాయి మండలాల్లోని పదికిపైగా అటవీ గ్రామాలకు రెండురోజులుగా రాకపోకలు నిలిచిపోయాయి. అత్యవసర సేవలకోసం ఎలిశెట్టిపల్లి, కొండాయి వద్ద మరపడవలను అధికారులు అందుబాటులో ఉంచారు. చెరువులు, కుంటలలోకి భారీగా వరదనీరు వచ్చి చేరుతోంది. ఏటూరునాగారం మండలంలోని కొండాయి గ్రామానికి చెందిన వృద్ధురాలు మాదరి పోచమ్మకు ఫిట్స్ రాగా మండలకేంద్రంలోని ఆస్పత్రికి తీసుకురావడానికి ప్రయత్నించారు. దొడ్ల- మల్యాల గ్రామాల మధ్య జంపన్నవాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో ఎయిర్ బోట్ ద్వారా ఎన్డీఆర్ఎఫ్ బృందం ఆమెను వాగు దాటించింది. అక్కడ నుంచి ఆమెను 108 వాహనంలో ఏటూరునాగారం సామాజిక ఆస్పత్రికి తీసుకెళ్లారు. అలాగే భారీ వర్షాలకు బొగత జలపాతం ఉధృతంగా ప్రవహిస్తోంది. జంపన్నవాగుపై కల్వర్టుల వద్ద ఉధృతి ఎక్కువగా ఉండగా ప్రజలు ఎవరూ దాటకుండా పోలీసులు హెచ్చరికలు జారీచేశారు. 33.6 మీటర్ల నిల్వ సామర్థ్యం కలిగిన లక్నవరం సరస్సులోకి ప్రస్తుతం 19ఫీట్లకు నీరు చేరింది.

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు జనం అతలాకుతలం అవుతున్నారు. జిల్లాలో సగటు వర్షపాతం 25.8 మిల్లీ మీటర్లు నమోదైంది. భారీ వర్షాలకు పలు చోట్ల చెరువులు, కుంటలకు మత్తడిపోస్తుండగా వాగులు ఉప్పొంగాయి. మహదేవపూర్, పలిమెల ప్రాంతంలోని గోదావరి ఐదు మీటర్ల ఎత్తులో, 3లక్షల 73వేల కూసెక్కుల నీటితో ప్రవహి స్తోంది. మల్హర్, కాటారం మీదుగా వెళ్లే మానేరు నది కూడా వర్షాల కారణంగా ఉప్పొంగింది. కాటారం మండలంలోని గుమ్మళ్లపల్లి మైసమ్మకుంట మత్తడి తెగిపోయింది. తూము దగ్గర బుంగపడటంతో పంటపొలాలు మునిగిపోయాయి. శంకరంపల్లిలో కూలీపనిచేసే శ్రీనివాస్ ఇంటిపైకప్పు కూలిపోయింది. పోతులవాయి, బొర్రవాగు, గంగారం అలుగువాగు ఉప్పొంగాయి. మల్లారం మిడిచెరువు అలుగు

మిగతా 7వ పేజీలో..

మేడిగడ్డ బ్యారేజీకి కొనసాగుతున్న వరద

- 3.73లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- అన్నారం బ్యారేజీకి 16,500 క్యూసెక్కులు

7



జ్వాలామాలిని అలంకరణలో భద్రకాళి

వరంగల్ కల్చరల్, జూలై 20: వరంగల్ నగరంలోని భద్రకాళి అమ్మవారి దేవాలయంలో కొనసాగుతున్న శాకంబరీ ఉత్సవాలు శనివారం నాటికి 15వ రోజుకు చేరుకున్నాయి. నిత్య పూజలు నిర్వహించిన అనంతరం ఉత్సవమూర్తికి ముద్ర అలంకరణ, అమ్మవారిని జ్వాలామాలినిగా అలంకరణ చేసి పూజలు నిర్వహించి భక్తులకు దర్శనానికి ఏర్పాట్లు చేశారు. ఈ అమ్మవారు భక్తులు కోరిన కోర్కెలను నెరవేర్చి సంతోషం కలిగే విధంగా కలుగజేస్తుందని ఆలయ ప్రధానార్చకుడు భద్రకాళి శేషు తెలిపారు.

నేడు శాకంబరీ అలంకరణ 8

ఆహా.. ఏమి రుచి

- టిఫిన్స్‌కు పెరుగుతున్న క్రేజ్
- నగరంలో వందలాదిగా వెలిసిన సెంటర్లు
- రుచి, నాణ్యత, వెరైటీలతో కస్టమర్ల ఆకర్షణ

7

జంట హత్యలపై దర్యాప్తు చేస్తున్నాం

- పోలీసు కమిషనర్ అంబర్‌కిషోర్ ఝా
- పదహారుచింతల్ తండా, పోలీస్‌స్టేషన్ సందర్శన



పదహారుచింతల్ తండాలో జంట హత్యలపై విచారిస్తున్న సీపీ అంబర్‌కిషోర్ ఝా

చెన్నారావుపేట, జూలై 20 : మండలంలోని పదహారుచింతల్ తండాలో ఇటీవల జరిగిన దంపతుల జంట హత్యపై పూర్తి స్థాయిలో దర్యాప్తు చేస్తున్నామని వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్‌ఝా అన్నారు. శనివారం పదహారుచింతల్ తండా, చెన్నారావుపేట పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌ను పరిసర ప్రాంతాలను సీపీ పరిశీలించారు. స్టేషన్‌పై ఉన్న సెంట్రీ భవనాన్ని ఎక్కి పూర్తిగా పరిశీలించగా, ఖాళీ మద్యం సీసా కనిపించడంతో ఆగ్రహం వ్యక్తంచేశారు. అనంతరం రికార్డులను తనిఖీ చేసి ఇంకా పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలను తెలుసుకున్నారు. స్టేషన్ పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలని, ఖాళీ స్థలంలో మొక్కల పెంపకాన్ని చేపట్టాలని పోలీసులకు సూచించారు. అనంతరం పదహారు చింతల్‌తండాకు చేరుకున్న సీపీ అంబర్ కిషోర్‌ఝా గ్రామస్థులు, బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామన్నారు. జంట హత్యలపై విచారణ లోతుగా కొనసాగుతుందని, హత్యకు సహకరించిన నిందితులను వదిలిపెట్టే ప్రసక్తేలేదన్నారు. గంజాయిపై ఉక్కుపాదం మోపుతున్నట్లు తెలిపారు. గంజాయి మత్తుకు యువత బానిస కావద్దన్నారు. వర్షాలతో వాగులు పొంగే ప్రమాదం ఉందన్నారు. రెండు రోజుల పాటు ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. వాగులు, వంకలు ఉన్న ప్రాంతాల్లో ప్రమాద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలని పోలీసు సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో నర్సంపేట ఏసీపీ కిరణ్‌కుమార్, సీఐ చంద్రమోహన్, ఎస్సై గూడ అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు గురుపౌర్ణమి

- గురు మందిరాల్లో ప్రత్యేక పూజలు
- అన్నదానాలు, భజనలు, కీర్తనలు

వరంగల్ కల్చరల్, జూలై 20 : గురుబ్రహ్మ.. గురువిష్ణు.. గురుదేవో మహేశ్వర గురుసాక్షాత్ పరబ్రహ్మ తస్మయే శ్రీగురవే నమః ఆషాఢశుద్ధ పౌర్ణమి రోజును గురుపౌర్ణమిగా, వ్యాస పౌర్ణమిగా పిలుస్తారు. తమ గురువులను గురుపౌర్ణమి రోజున ఆరాధించి పూజించే రోజుగా ప్రతి ఒక్కరూ గురుపౌర్ణమి వేడుకలను జరుపుకుంటారు. ఆదివారం జిల్లాలోని అన్ని గురు మందిరాలు, సాయిబాబా దేవాలయాలు, దత్తాలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు కొనసాగుతాయి. దత్తాత్రేయ స్వామి, సాయిబాబా దేవాలయాల్లో గురుమూర్తులకు అభిషేకం, అలంకరణ కొనసాగుతుంది. ఆ రోజున నాలుగు హారతులను ఇస్తారు. ఉదయం 5గంటలకు కాగడ హారతి, మధ్యాహ్నం 12 గంటలకు నైవేద్య దూప్ హారతి, సాయంత్రం 6 గంటలకు సంధ్యా హారతి, రాత్రి 10 గంటలకు శేజ్ హారతి ఇస్తారు. అలాగే వాడవాడల అన్నదానాలు, ప్రసాదాలను పంచిపెడుతారు. వరంగల్ నగరంలోని షిర్డీ సాయిబాబా దేవాలయాలు, భజన మందిరాల్లో ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు హారతులు, అన్నదానాలు, భజనలు, అభిషేకాలు ఏర్పాటు చేశారు. వేలాది మంది సాయిబాబాను దర్శించుకొని భోజనాన్ని స్వీకరించే విధంగా ప్రతీ ఏటా ఏర్పాట్లు చేస్తున్నారు.

భద్రకాళి సమీపంలోని సాయిబాబా దేవాలయం, ఎల్లం బజార్‌లోని సాయి సేవాదళ్ గురుపౌర్ణమి వేడుకలు, శ్రీకృష్ణ కాలనీలోని సాయిభజన మండలి ఆధ్వర్యంలో, దేశాయిపేటలోని సాయిబాబా దేవాలయం, ఓసిటీలోని సాయి దేవాలయం, ఖిలావరంగల్ సమీపంలోని సాయి దేవాలయం, నక్కలపల్లిలోని సాయి దేవాలయం, ములుగురోడ్‌లోని శ్రీగణపతి సచ్చిదానంద వరద దత్తక్షేత్రం భజనలు ఏర్పాటు చేశారు.





టౌన్‌షిప్ ఏర్పాటుకు వేగవంతంగా చర్యలు

కలెక్టర్ డాక్టర్ సత్యశారద



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సత్యశారద

వరంగల్ కలెక్టరేట్, జూలై 20: జిల్లాలోని కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కుకు భూములిచ్చిన నిర్వాసితులకు టౌన్‌షిప్ ఏర్పాటుకు వేగవంతంగా చర్యలు చేపట్టాలని కలెక్టర్ డాక్టర్ సత్యశారద అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కాకతీయ టెక్స్‌టైల్ పార్కు భూసేకరణ పురోగతిపై సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ టెక్స్‌టైల్ పార్కుకు భూములు ఇచ్చిన నిర్వాసితులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జిల్లా పర్యటనలో ఆదేశించిన విధంగా టౌన్‌షిప్ ఏర్పాటు చేసి మౌలిక వసతులైన పాఠశాల, కమ్యూనిటీ హాల్, ప్లే గ్రౌండ్, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటుకు ప్రాజెక్టు రిపోర్టు సిద్ధంచేసి సమర్పించాలని సూచించారు. అదేవిధంగా మ్యాప్‌లను కూడా సిద్ధం చేయాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, ఆర్డీవో కృష్ణవేణి, టీజీఐఐసీ జోనల్ మేనేజర్ అజ్మీర స్వామి, ఈఈ సునీత, ఆర్‌అండ్‌బీ అధికారి జితేందర్‌రెడ్డి, నాగరాజ్, గీసుగొండ, సంగెం తహసీల్దార్లు రియాజుద్దీన్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై బల్దియా ఉక్కుపాదం

- హైకోర్టు ఆదేశాల మేరకు అక్రమ కట్టడాల కూల్చివేత
- 28 ఏసీ షెడ్లు, 78 కాంపౌండ్ వాల్స్ నేలమట్టం



భద్రకాళి బండ్ ప్రాంతంలో అక్రమ కట్టడాలను కూల్చివేస్తున్న జేసీబీ

వరంగల్ కార్పొరేషన్, జూలై 20 : గ్రేటర్ వరంగల్ నగరంలోని 10, 28వ డివిజన్లలో అక్రమ కట్టడాలపై బల్దియా అధికారులు కొరడా ఝుళిపించారు. బఫర్‌జోన్‌ను ఆక్రమించిన ఆక్రమణదారులపై ఉక్కుపాదం మోపారు. ఎఫ్‌టీఎల్‌ను ఆక్రమించి కట్టడాలు జరిపిన ఇండ్లను, కాంపౌండ్ వాల్స్‌ను గుర్తించి హైకోర్టు ఆదేశాల మేరకు శనివారం తెల్లవారుజామున కూల్చివేశారు. జిల్లా టాస్క్‌ఫోర్స్ ఆధ్వర్యంలో టౌన్ ప్లానింగ్, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు సుమారు 200 మంది పోలీసు సిబ్బంది సహకారంతో అక్రమ కట్టడాలను తొలగించారు. వరంగల్ నగరంలోని భద్రకాళి చెరువు సమీపంలోని ఎఫ్‌టీఎల్(ఫుల్ ట్యాంక్ లెవల్) పరిధిలో అక్రమ నిర్మాణాలను గుర్తించి 28 ఏసీ షెడ్లు, 78 కాంపౌండ్ వాల్స్‌ను తొలగించినట్టు బల్దియా టౌన్ ప్లానింగ్ అధికారులు వెల్లడించారు. సిటీ ప్లానర్ వెంకన్న సారథ్యంలో భద్రకాళి బండ్ సమీపంలో గల జయ నర్సింగ్ కళాశాల నుంచి భద్రకాళి బండ్ వరకు, సంతోషిమాత కాలనీ నుంచి బొందివాగు వరకు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్న అక్రమ నిర్మాణాలను తొలగించినట్టు సీపీ వెంకన్న తెలిపారు.కూల్చివేతల కార్యక్రమంలో వరంగల్ బల్దియా అధికారులతో పాటు పోలీసులు పాల్గొన్నారు.

హైకోర్టులో పిటిషన్ దాఖలు

వరంగల్ నగరంలో చాలా చోట్ల చెరువులు, కుంటలను కొందరు వ్యక్తులు ఆక్రమించి కట్టడాలు నిర్మించడం వల్ల వర్షాకాలంలో సాఫీగా వెళ్లవలసిన నీరు ఇండ్లలోకి చేరి వరద ముంపునకు గురవుతున్నారు. ఇది గమనించిన వరంగల్ నగరానికి చెందిన విశ్రాంత ఆచార్యుడు ఎం.పాండు రంగారావు అక్రమ కట్టడాలపై హైకోర్టులో పిటిషన్ వేశారు. దీనిపై స్పందించిన చీఫ్ జస్టిస్ ఆలోకా రాధే, జస్టిస్ జి.అనిల్‌కుమార్ చెరువు ప్రాంతాల్లో నిర్మించిన అక్రమ కట్టడాలను కూల్చివేయాలని ఇటీవల ప్రిన్సిపల్ సెక్రెటరీ, మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్, ఇరిగేషన్ చీఫ్ ఇంజనీర్, జిల్లా కలెక్టర్, బల్దియా కమిషనర్, కుడా చైర్మన్లకు నోటీసులు జారీ చేశారు. దీంతో శనివారం తెల్లవారుజామున పోలీసుల సహాయంతో రంగంలోకి దిగిన బల్దియా అధికారులు.. అక్రమ కట్టడాలను గుర్తించి జేసీబీల సహాయంతో కూల్చివేశారు.



రుణమాఫీ ప్రక్రియను పర్యవేక్షించండి..

బ్యాంకు అధికారులతో టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు

హనుమకొండ సిటీ, జూలై 20: రుణమాఫీ ప్రయోజనాలు సంపూర్ణం అయ్యేలా నిత్య పర్యవేక్షణ జరపాలని టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు డీసీసీ బ్యాంకు అధికారులు, సహకార సంఘాల ప్రతినిధులను ఆదేశించారు. శనివారం హనుమకొండలోని డీసీసీ బ్యాంకు ప్రధాన కార్యాలయంలో ఉమ్మడి జిల్లాలోని బ్యాంకుఅధికారులు, సహకార సంఘాల ప్రతినిధులతో ఆయన టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. రుణమాఫీప్రక్రియ అమలు, రైతుల ఖాతాల్లో డబ్బులు జమ కావడం, సమస్యలు, పరిష్కార చర్యలు తదితర అంశాలపై అధికారులతో సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా అధికారులకు రవీందర్‌రావు దిశా, నిర్దేశం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రుణమాఫీ చేయడం చారిత్రక ఘటమన్నారు. రైతులకు ఖాతాల్లో జమ అయ్యే చర్యలు వేగవంతం చేయాలన్నారు. రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అయ్యాక ఇతర ఖాతాల కింద ఆ డబ్బులను తీసుకోవద్దని సూచించారు. రుణమాఫీ కాని రైతుల వివరాలను సేకరించి కారణాలు విశ్లేషించి పరిష్కార చర్యలు చేపట్టాలని ఆదేశించారు.



సమీక్ష నిర్వహణలో టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు

రైతులకు సమస్యలు ఉత్పన్నం కాకుండా సేవలు అందించాలన్నారు. రుణమాఫీ నివేదికలు ఎప్పటికప్పుడు సిద్ధం చేసుకొని తనకు అందించాలని ఆదేశించారు. ఈ సమీక్షలో డీసీసీ బ్యాంకు సీఈవో వజీర్ సుల్తాన్, జీఎం ఉషశ్రీ, డీజీఎం అశోక్, ఏజీఎం మధు, స్రవంతి, కృష్ణమోహన్, గంప స్రవంతి, రాజు పాల్గొన్నారు.

వేం నరేందర్‌రెడ్డిని కలిసిన మార్నేని

రుణమాఫీ ప్రకటించిన సందర్భాన్ని పురస్కరించుకొని ప్రభుత్వ ప్రధాన సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డికి టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు కృతజ్ఞతలు తెలియచేశారు. శనివారం హైదరాబాద్‌లో వేం నరేందర్‌రెడ్డిని కలిసి పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సన్మానించారు. రుణమాఫీ ద్వారా రైతులకు న్యాయం చేశారంటూ నరేందర్‌రెడ్డిని టెస్కాబ్ చైర్మన్ అభినందించారు.

పాఠశాల పనివేళల్లో స్వల్పమార్పులు

ఉత్తర్వులు జారీ చేసిన పాఠశాల విద్యాశాఖ

లింగాలఘణపురం, జూలై20: రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల పనివేళల్లో స్వల్ప మార్పులు చేస్తూ తెలంగాణ పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, జడ్పీ హైస్కూళ్ల పని వేళలు ఇప్పటిదాకా వేర్వేరుగా కొనసాగుతున్నాయి. కాగా అన్ని పాఠశాలల సమయాలను ఉదయం 9.00 గంటల నుంచి సాయంత్రం 4.15 వరకు ఒకే రకంగా మారుస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. గతంలో హైస్కూళ్లు ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 4.45 గంటల వరకు, ప్రాథమిక పాఠశాలలు 9.00 గంటల నుంచి 4.00 గంటల వరకు, ప్రాథమికోన్నత పాఠశాలలు ఉదయం 9.15 గంటల నుంచి సాయంత్రం 4.15 గంటల వరకు కొనసాగుతుండేవి. ప్రస్తుతం అన్ని పాఠశాలలకు ఒకే సమయాన్ని నిర్ణయించారు. అయితే ట్రాఫిక్ సమస్యల దృష్ట్యా హైదరాబాద్, సికింద్రాబాద్ జంటనగరాల్లో మాత్రం ఉదయం 8.45 గంటల నుంచి సాయంత్రం 4.00 గంటల వరకు నిర్వహించేలా విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ బి. వెంకటేశం ఉత్తర్వులు జారీ చేశారు.

నేడు ఆకాశవాణిలో వెంకయ్యనాయుడితో కార్యక్రమం

వరంగల్ కార్పొరేషన్, జూలై 20: తెలుగు పద్యాలు ధారావాహిక కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఉదయం 10 గంటలకు వరంగల్ ఆకాశవాణితో పాటు రెండు తెలుగు ఉభయ రాష్ట్రాల్లోని అన్ని రేడియో కేంద్రాల నుంచి మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడుతో పరియచ కార్యక్రమం ప్రసారం చేయనున్నామని ఆకాశవాణి వరంగల్ కేంద్రం కార్యక్రమ నిర్వహణ అధికారి రవికుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రేడియోతో మాజీ ఉపరాష్ట్రపతికి ఉన్న అనుబంధాన్ని వివరిస్తారని తెలిపారు. ఆకాశవాణి విశ్రాంత ఏడీజీ, ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ ఆర్. అనంతపద్మనాభరావు పరిచయకర్తగా వ్యవహరిస్తారన్నారు. శ్రోతులు తప్పకుండా వెంకయ్యనాయుడు పరియక కార్యక్రమం వినాలని రవికుమార్ కోరారు.

28 నుంచి అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు

కగార్ ఆపరేషన్‌ను ప్రజా ఉద్యమాల ద్వారా ఓడిద్దాం..

భద్రాద్రి కొత్తగూడెం, అల్లూరి సీతారామరాజు డివిజన్ నేత ఆజాద్

మహబూబాబాద్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): ఈనెల 28వ తేదీ నుంచి ఆగస్టు 3 వరకు ప్రజాపోరాటాల్లో అసువులు బాసిన అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను నిర్వహించుకుందామని భారతక మ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) భద్రాద్రి కొత్తగూడెం - అల్లూరిసీతారామరాజు డివిజన్ కమిటీ (బీకే. ఏఎస్ఆర్) నాయకుడు ఆజాద్ పిలుపు నిచ్చారు. మావోయిస్టు నేత ఆజాద్ పేరిట మహబూబాబాద్ జిల్లా 'ఆంధ్రజ్యోతి' కార్యాలయానికి శనివారం పంపిన పత్రిక ప్రకటనలో పలు అంశాలను వెల్లడించారు. దేశంలో నక్సల్బరీ సాయుధ రైతాంగ తిరుగుబాటు నుంచి నేటి వరకు నూతన ప్రజాస్వామిక విప్లవం కోసం 50 ఏళ్ల ప్రజా యుద్ధం కొనసాగుతుందని చెప్పారు. ఈ పోరాటంలో చారుమజుందార్, కనాయ్‌చటర్జీ అమరులయ్యారని వారి విప్లవోద్యమాన్ని పురోగమిస్తూ అనేక మంది ప్రజలు ప్రాణాలర్పించారని చెప్పారు. గతేడాది ప్రభుత్వ ఘాతుక చర్యల్లో 194 మంది కామ్రేడ్స్ అమరులయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు.

అమరుల అశయ సాధనకు పునరంకితమవుదాం

ఏటా జూలై 28న అమరుల దినోత్సవాన్ని జరుపుకుంటామని, పోరాటాల్లో వీర మరణం పొందిన వారికి జోహార్లు అర్పిస్తూ వారి ఆశయసాధన కోసం పునరంకితమవ్వాలని ఆజాద్ అన్నారు. మోదీ నాయకత్వంలోని బీజేపీ 2047 వరకు బ్రహ్మణీయ హిందూ రాజ్యం నిర్మించే లక్ష్యంతో సామ్రాజ్యవాదులు, కార్పొరేట్‌ల ప్రయోజనాలను ప్రోత్సహిస్తోందని ఆరోపించారు. మేకిన్ ఇండియా, డిజిటల్ ఇండియా ప్రచారాలతో విదేశీ పెట్టుబడులను ఆకర్షించేందుకు నిబంధనలను సరళతరం చేసిందని ఆరోపించారు. దేశ సంపదను దోచుకునేలా వందకు పైగా చట్టాలను సవరించిందని మండిపడ్డారు. అంబానీ, ఆదానీలు లాభాలు పొందడానికి అనేక ఒప్పందాలు కుదుర్చుకుందని విమర్శించారు. దశాబ్దాల పోరాటం తర్వాత సాధించిన తెలంగాణ రాష్ట్రంలో కనీస ప్రజాస్వామ్యత హక్కులు కూడా లేవన్నారు. నయవంచనకు గురిచేసిన బీఆర్ఎస్‌ను ప్రజలు అధికారంలో నుంచి దించి కాంగ్రెస్ పార్టీకి అధికారం ఇచ్చారని, వారు ఆరునెలల్లో అవినీతి, అక్రమాలు, బ్రహ్మణీయ హిందూత్వంపై పోరాడుతున్న వారిపై దాడులు చేశారని ఆరోపించారు. మావోయిస్టు పార్టీని నిర్మూలించేందుకు కేంద్రప్రభుత్వం కలిసి ఎన్‌కౌంటర్లు, అక్రమ కేసుల్లో అమాయకులను అరెస్టు చేస్తుందని ఆజాద్ పేర్కొన్నారు. 2017లో సమాధాన్, 2022లో సూరజ్‌కుండ్ విఫలమయ్యాయని, 2024 జనవరి నుంచి కగార్ ఆపరేషన్ పేరుతో క్రూరమైన దాడులు ప్రారంభించారన్నారు. దానిని ప్రజాఉద్యమాలతో ఓడిద్దామని పిలుపునిచ్చారు.

బాలికపై అత్యాచారయత్నం

నిందితుడిపై ఫోక్సో కేసు

వరంగల్ క్రైం, జూలై 20: వరంగల్ నగరంలో దారుణం చోటుచేసుకుంది ఎనిమిదేళ్ల బాలికపై యువకుడు అత్యాచార యత్నం చేశాడు. ఈ సంఘటన కాకతీయ యూనివర్సిటీ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. స్టేషన్ పరిధిలోని పెగడపల్లి గ్రామంలో బుధవారం జరిగిన ఈ దారుణం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. తన తల్లికి ఫోన్ చేయాలని ఇంటి సమీపంలో ఉండే సుమన్ అనే యువకుడి వద్దకు వెళ్లిన బాలికను లోపలికి తీసుకెళ్లి అత్యాచారయత్నం చేశాడు. చేసే బాలిక ప్రతిఘటించి యువకుడి చేతిని కొరికి బయటికి పరుగెత్తుకొచ్చింది. అనంతరం విషయాన్ని తన తల్లికి సమాచారం ఇచ్చింది. బాలిక తల్లి పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు నిందితుడు సుమన్‌పై ఫోక్సో కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపారు. ఈ విషయాన్ని ఎస్ఐ రవీందర్ ధ్రువీకరించారు.

రిజిస్ట్రేషన్ శాఖలో బదిలీలు

76 మంది ఉద్యోగులు స్థాన చలనం

రాంనగర్, జూలై 20: రిజిస్ట్రేషన్ శాఖలో 76 మంది ఉద్యోగులను (సీనియర్ అసిస్టెంట్ నుంచి అటెండర్ వరకు) బదిలీ అయ్యారు. అటెండర్ నుంచి జూనియర్ అసిస్టెంట్ వరకు జిల్లా రిజిస్ట్రార్ రవి, సీనియర్ అసిస్టెంట్ల బదిలీలు కమిషనర్ జ్యోతి బుద్ధ ప్రకాశ్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయిన వారిలో 13 మంది సీనియర్ అసిస్టెంట్లు, 38 మంది జూనియర్ అసిస్టెంట్లు, 20 మంది అటెండర్లు, 4 క్యాషియర్లు, 1 టైపిస్టు ఉన్నారు. కాగా సీనియర్ అసిస్టెంట్లు అందరు ఖమ్మం జిల్లాకు బదిలీ కాగా, అక్కడి నుంచి 13మంది వరంగల్‌కు వస్తున్నారు. జూనియర్ అసిస్టెంట్ నుంచి అటెండర్ వరకు బదిలీ అయిన వారు ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని 15 కార్యాలయాలకు కేటాయించబడ్డారు. సీనియర్ అసిస్టెంట్లు పొరుగు జిల్లాకు బదిలీ అయ్యారు.

రెవెన్యూశాఖలో...

హనుమకొండ టౌన్: స్పౌజ్, ప్రత్యేక కారణాలతో దరఖాస్తులు చేసుకున్న మల్టీజోన్-1, జోన్-4 పరిధిలో ఉన్న తహసీల్దార్, సీనియర్ అసిస్టెంట్‌లను బదిలీ చేస్తూ సీసీఎల్ఏ కమిషనర్ నవీన్‌మిట్టల్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఖమ్మంలో పనిచేస్తున్న తహసీల్దార్ టి. గౌరిశంకర్‌ను హనుమకొండ జిల్లాకు కేటాయిస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అదే విధంగా జోనల్-4 పరిధిలో వరంగల్ జిల్లాలో పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్ యం. రమేశ్‌ను హనుమకొండకు, మహబూబాబాద్ జిల్లాలో పనిచేస్తున్న జి. అనురాధను హనుమకొండ జిల్లాకు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

నలుగురు డిప్యూటీ తహసీల్దార్‌లు బదిలీ

నాలుగేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న నలుగురు డిప్యూటీ తహసీల్దార్‌లను బదిలీ చేస్తూ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య ఉత్తర్వులు జారీ చేశారు. ఎ. లలిత స్పెషల్ కలెక్టర్ ఎల్ఏ వరంగల్ నుంచి యుఎల్‌సీ వింగ్ హనుమకొండ కలెక్టర్‌కు, బి.సంగీత ఆత్మకూరు మండల ఆఫీస్ నుంచి హనుమకొండ కలెక్టర్ యుఎల్‌సీ వింగ్‌కు, ఎల్.భాస్కర్ మూర్తి హనుమకొండ కలెక్టరేట్ యుఎల్‌సీ వింగ్ నుంచి ఆత్మకూరు తహసీల్దార్ ఆఫీస్‌కు, కె.సూర్యనారాయణ కలెక్టరేట్ యుఎల్‌సీ వింగ్ హనుమకొండ నుంచి స్పెషల్ కలెక్టర్ ఎల్ఏ వరంగల్‌కు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

బల్దియా పరిధిలో పలువురికి బదిలీలు

వరంగల్ కార్పొరేషన్, జూలై 20: గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ పరిధిలో ఒకే చోట చాలా కాలంగా విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగులను బదిలీ చేశారు. ఈ మేరకు హైదరాబాద్ ఇన్‌చార్జి సీడీఎంఏ అధికారి వీపీ గౌతమ్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.

శానిటరీ ఇన్‌స్పెక్టర్ల విభాగంలో..

పేరు	ప్రస్తుతం	బదిలీ ఐన ప్రదేశం
పి. సురేష్	వరంగల్ బల్దియా	పరకాల
జె. భీమయ్య నాయక్	వరంగల్ బల్దియా	ఖమ్మం
గోల్కొండ శ్రీను	వరంగల్ బల్దియా	ఖమ్మం
ఎస్. కరుణాకర్	వరంగల్ బల్దియా	మహబూబాబాద్

శానిటరీ సూపర్‌వైజర్‌ల విభాగంలో..

మాదాసి సాంబయ్య	వరంగల్ బల్దియా	ఖమ్మం

హెల్త్ అసిస్టెంట్ల విభాగంలో...

సెగ్గోజు కిరణ్‌కుమార్	వరంగల్ బల్దియా	పరకాల
ఈశ్రం శ్రీను	వరంగల్ బల్దియా	నర్సంపేట
రామ శ్రీధర్	వరంగల్ బల్దియా	మహబూబబాద్
ఎన్. ఎల్లస్వామి	వరంగల్ బల్దియా	ఖమ్మం
గోనెల రవీందర్	వరంగల్ బల్దియా	పాల్వంచ
బి. సంపత్‌కుమార్	వరంగల్ బల్దియా	ఇల్లందు
గద్దల శివకుమార్	వరంగల్ బల్దియా	ఇల్లందు
ఎస్. శ్యాంకుమార్	వరంగల్ బల్దియా	మణుగూరు

సీనియర్ అసిస్టెంట్ల విభాగంలో...

ఇజ్రాయెల్	వరంగల్ బల్దియా	ఖమ్మం

నాలుగో తరగతి ఉద్యోగుల బదిలీలకు బ్రేక్

వరంగల్ కార్పొరేషన్‌లో జరుగుతున్న నాలుగో తరగతి ఉద్యోగుల బదిలీల ప్రక్రియను 10 రోజుల పాటు నిలిపివేస్తున్నారు. ఆగస్టు 1 నుంచి ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం తిరిగి బదిలీల ప్రక్రియను చేపట్టనున్నట్లు తెలిపారు.

ముసురుకుంది..

(5వ పేజీ తరువాయి)

వాగు ఉప్పొంగి రాకపోకలు నిలిచిపోయాయి. అలాగే మొగుళ్లపల్లి, టేకుమట్ల ప్రాంతాల్లో పలుచోట్ల రోడ్లు దెబ్బతిని రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు భయాందోళనకు గురయ్యారు.

● జనగామ జిల్లా అంతటా శనివారం ముసురేసింది. జిల్లాలో పంటకు సరిపడా వర్షాలు ఇప్పటికీ పడలేదు. ఈ తరుణంలో 24 గంటలుగా ముసురు పడడంతో పత్తి పంటకు కొంత ఊరట కల్గినట్టయింది. మరోవైపు ఎడతెరిపి లేకుండా కురుస్తున్న ముసురు కారణంగా జిల్లాలోని పాత ఇళ్లకు ప్రమాదం ఏర్పడుతోంది. ఏకధాటిగా కురుస్తున్న ముసురుతో నర్మెట్టలో ఓ పాత ఇంటి గోడ కూలింది. జిల్లా అంతటా శనివారం ముసురుతో కూడిన స్వల్ప వర్షం కురిసింది. జిల్లావ్యాప్తంగా శనివారం 7.9 మి.మీ సగటు వర్షపాతం నమోదైంది. జిల్లాలో అత్యధికంగా పాలకుర్తి మండలం వావిలాలలో 13.8 మి.మీ, అత్యల్పంగా నర్మెట్టలో 0.8 మి.మీ వర్షపాతం నమోదైంది.

● మహబూబాబాద్ జిల్లాలో రెండ్రోజులుగా ఏకధాటిగా వర్షాలు కురుస్తున్నాయి. శుక్రవారం రాత్రి పలు మండలాల్లో ఓ మోస్తారు నుంచి భారీ వర్షం కురిసింది. గార్ల పాకాల వాగు రాంపురం బ్రిడ్జిపై నుంచి వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. రాబోయే రెండు, మూడ్రోజుల్లో జిల్లాలో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ హెచ్చరించడంతో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. కలెక్టరేట్ కార్యాలయంలో కమాండ్ కంట్రోల్ రూం సెల్-7995074803 నెంబర్ ఏర్పాటు చేసినట్లు జిల్లా అద్వైత్‌కుమార్ సింగ్ తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సెల్ 8712656928 నెంబర్‌తో కంట్రోల్ రూంను ఏర్పాటు చేశారు. ప్రజలు అత్యవసర సమయాల్లో ఈ నెంబర్లకు ఫోన్ చేసి సహాయం తీసుకోవాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్, ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్ కోరారు. గార్ల పాకాల వాగు పొంగుతుండడంతో మహబూబాబాద్ డీఎస్పీ తిరుపతిరావు, గార్ల, బయ్యారం సీఐ రవికుమార్ ఆధ్వర్యంలో వాగును పరిశీలించి బారికేడ్‌లు ఏర్పాటు చేసి రాకపోకలు బంద్ చేశారు. వాగు పొంగుతుండడంతో రాంపురం, మద్దివంచ, కొత్తతండా, పులిగట్టుతండా, గొల్లచర్ల, రాముతండా, హున్యతండాతో పాటు పలు గ్రామాలకు రాకపోకలు బంద్ అయ్యాయి. కొత్తగూడ మండలంలో కత్తెర్లవాగు, భూర్కపల్లి, కొత్తపల్లి వాగులు ప్రవహిస్తున్నాయి. బయ్యారంలో పెద్దచెరువు, గౌరారం కట్టు, తులారం ప్రాజెక్టు అలుగులు పోస్తున్నాయి. పాండవుల గుట్ట జలపాతం జాలువారుతుండడంతో పర్యాటకుల సంఖ్య పెరుగుతోంది. గూడూరు మండలంలోని భీమునిపాదం జలపాతం జాలువారుతుండడంతో ఇతర జిల్లాల నుంచి పర్యాటకుల సందడి పెరిగింది.

● హనుమకొండ జిల్లాలో మాత్రం ఒక మోస్తరుగా మాత్రమే కురుస్తున్నాయి. ఇప్పటి వరకు భారీ వర్షాలు పడలేదు. భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరిక చేసినప్పటికీ జిల్లాలో భారీగా వర్షాలు కురవలేదు. రెండు మూడు రోజులుగా ఆకాశం మేఘావృతమై ఉంటోంది. రాత్రంతా ముసురు పడుతోంది. పగలు వర్షం జాడలు లేవు. జిల్లాలో గత 24 గంటల్లో సరాసరి 16.3 మి.మీ. వర్షపాతం మాత్రమే రికార్డయింది. ఆత్మకూరు, దామెర, కమలాపూర్, హసన్‌పర్తి మండలాల్లో ఒక మోస్తరు వర్షం కురిసింది. మిగతా మండలాల్లో జల్లులు మాత్రమే పడ్డాయి. పరకాలలో లోటు వర్షపాతం నమోదైంది. తొమ్మిది మండలాల్లో ఇప్పటి సాధారణ వర్షపాతం మాత్రమే రికార్డయింది. భీమదేవరపల్లి, వేలేరు, ఎల్కతుర్తి, ఆత్మకూరు మండలాల్లో మాత్రమే సాధారణం కన్నా కాస్త ఎక్కువ వర్షం పడింది. భారీ వర్షాలు లేకపోవడంతో చెరువులు, కుంటల్లోకి పెద్దగా నీరు చేరలేదు. ఎడతెరిపి లేకుండా ముసురు పడుతుండడంతో జిల్లా వ్యాప్తంగా వరినాట్లు ఊపందుకున్నాయి. తుంపర్లు పడుతుండడంతో నేలతడిసి నాట్లకు అనుకూలంగా ఉండడంతో వరి స్వల్పకాలిక రకాలను రైతులు నాటుతున్నారు. బావుల కింద మాత్రం రైతులు దీర్ఘకాలిక రకాలను అప్పటికే వేశారు. సాధారణంకన్నా మించి వర్షం కురవకపోవడంతో వరి, పత్తి సాగులో జాప్యం జరుగుతోంది. ఇప్పటివరకు 25శాతం మేరకే వరి నాట్లు పడ్డాయి.

● వరంగల్ జిల్లాలో ఇప్పటి వరకు సాధారణ వర్షపాతమే నమోదైంది. వర్షాకాలం ప్రారంభమైన తర్వాత ఇప్పటి వరకు సాధారణం కన్నా 10 నుంచి 15 శాతం మేరకు అధిక వర్షపాతం రికార్డు కావలసి ఉండింది. కానీ సాధారణ వర్షమే పడింది. దీనితో జిల్లాలో చెరువులు, కుంటలు, బావుల్లోకి చాలినంత నీరు చేరలేదు. మూడు రోజులుగా ముసురుపడుతోంది. భారీ వర్షం జాడే లేదు. గురువారం ఒక్క రోజే ఒక మోస్తరు భారీ వర్షం పడింది. రెండు రోజులుగా జిల్లా వ్యాప్తంగా 13 మండలాల్లో 22 నుంచి 25 మి.మీ. వర్షమే పడింది. దాదాపు అన్నిమండలాల్లో ఇప్పటి వరకు సాధారణ వర్షమే కురిసింది. పశ్చిమ, మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండ ప్రభావం వల్ల రానున్న రెండు రోజులు వరంగల్, హనుమకొండ జిల్లాల్లో భారీ వర్షాలు కురవనున్న దృష్ట్యా వాతావరణ శాఖ ఎల్లో అలర్ట్‌ను ఇచ్చింది. దీంతో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. భారీ వర్షాలు కురిసిన పక్షంలో తీసుకోవలసిన చర్యలపై కలెక్టర్ సత్యశారద సంబంధిత అధికారులను అలర్ట్ చేశారు.



మంగపేట మండలం కమలాపురం బిల్ట్ ఇన్‌టేక్‌వెల్ వద్ద గోదావరి



రామన్నగూడెం పుష్కరఘాట్ వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి

పెరుగుతున్న గోదావరి ఉధృతి

మహదేవపూర్/మంగపేట/ఏటూరునాగారం/వాజేడు,జూలై 20: ఎడతెరిపి లేని వర్షాల కారణంగా భూపాలపల్లి, ములుగు జిల్లాలో గోదావరి ప్రవాహం పెరిగింది. మహదేవపూర్ మండలంలోని కాళేశ్వరం, ముక్తీశ్వర త్రివేణి సంగమం వద్ద గోదావరి ఉధృతంగా ప్రవహిస్తోంది. పుష్కరఘాట్ వద్ద గోదావరి క్రమేణా పెరుగుతోంది. సరస్వతి బ్యారేజీ వద్ద గేట్లు తీయడంతో వరద నీరు ఎక్కువ రావడంతో గోదావరి ఉధృతంగా ప్రవహిస్తోంది. మానేరువాగు, వంకల నుంచి పెద్ద ఎత్తున గోదావరిలోకి పెద్ద ఎత్తున వరద చేరుతోంది. శనివారం సాయంత్రం వరకు 8.32 మీటర్ల ఎత్తులో ప్రవాహం నమోదైంది.



మంగపేట పుష్కరఘాట్ వద్ద గోదావరి వరదపోటుతో కోతకు గురవుతున్న వ్యవసాయ భూములు

మంగపేట మండలంలో..

భారీ వర్షాలకు మంగపేట మండలంలోని వాగులు, వంకలు, ఒర్రెలు, ఇతర జలపాతాల నుంచి వరద నీరు గోదావరిలో కలుస్తోంది. దీంతో శనివారం ఉదయం 8.02 మీటర్ల ప్రవాహం నమోదైంది. సాయంత్రం వరకు రెండు సెంటీ మీటర్లవరకు తగ్గుతూ వచ్చింది. కమలాపురం బిల్ట్ ఇన్‌టేక్‌వెల్ వద్ద సాయంత్రం వరకు 8 మీటర్ల దూరం వరకు వరద ప్రవాహం కనిపించింది. ఎగువ ప్రాంతాల్లో బ్యారేజీల వద్ద నీటిని విడుదల చేసినప్పుడు వరద పెరగడం, గేట్లు మూసినప్పుడు తగ్గడం జరుగుతోందని జలవనరుల శాఖ అధికారులు చెబుతున్నారు. గోదావరి పెరిగినప్పుడు కమలాపురం, మంగపేట మధ్య వరద పోటుతో వ్యవసాయ భూములు కోతకు గురవుతూ విలువైన భూములు వరదలో కలుస్తున్నాయి.

ఏటూరునాగారం మండలంలో..

భారీ వర్షాలకు తోడు మండలంలోని తుపాకులగూడెంలోని సమ్మక్క - సారలమ్మ గేట్లన్నీ ఎత్తడంతో మండలంలోని రామన్నగూడెం పుష్కరఘాట్ వద్ద గోదావరి ఉరకలేస్తోంది. శనివారం ఉదయం 7గంటలకు 11.730 మీటర్ల నీటిమట్టం ఉండగా మధ్యాహ్నానికి 11.970 మీటర్లకు చేరింది. సాయంత్రం 6 గంటలకు 12.210 మీటర్లకు నీటిమట్టం చేరింది. కాగా పుష్కరఘాట్ వద్ద గోదావరి నీటిమట్టం 14.830 మీటర్లకు చేరితే అధికారులు మొదటి ప్రమాద హెచ్చరికను జారీ చేయనున్నారు.

పేరూరు వద్ద..

మండలంలోని పేరూరు వద్ద గోదావరి వేగంగా పెరుగుతోంది. ఎగువన ఉన్న ఇంద్రావతి, సమ్మక్కసాగర్ బ్యారేజీల నుంచి వరద నీరును దిగువకు విడుదల చేస్తుండటంతో గోదావరికి భారీగా వరద నీరు చేరుతోంది. శనివారం ఉదయం 8గంటలకు 12.850 మీటర్ల నీటిమట్టంతో ఉన్న గోదావరి 10 గంటలకు 12.870 మీటర్లు నమోదైంది. మధ్యాహ్నం 1గంటకు 12.880 మీటర్లు, సాయంత్రం 6గంటలకు 13.240 మీటర్లకు చేరుకుంది.

బ్యారేజీలకు కొనసాగుతున్న వరద నీరు

● మేడిగడ్డ బ్యారేజీకి 3.73లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

● అన్నారం బ్యారేజీకి 16,500 క్యూసెక్కులు

మహదేవపూర్ రూరల్/కన్నాయిగూడెం, జూలై 20: కాళేశ్వరం ప్రాజెక్టులో ప్రధానమైన భూపాలపల్లి జిల్లాలోని మహదేవపూర్ మండలంలోని మేడిగడ్డ బ్యారేజీకి వరద ఉధృతి కొనసాగుతోంది. బ్యారేజీకి ఎగువన వర్షాలు విస్తారంగా కురుస్తుండటంతో ఇన్‌ఫ్లో క్రమంగా పెరుగుతూ వస్తోంది. శుక్రవారం బ్యారేజీలోకి ఇన్‌ఫ్లో 3.10లక్షల క్యూసెక్కులుగా ఉండగా శనివారం సాయత్రం వరకు 3.73లక్షల క్యూసెక్కులకు పెరిగింది. దీంతో బ్యారేజీ 85గేట్లను ఎత్తి వచ్చిన నీటిని వచ్చినట్లే దిగువకు పంపిస్తున్నారు. శనివారం బ్యారేజీ వద్ద 5 మీటర్ల ఎత్తులో గోదావరి ప్రవహిస్తోంది. అన్నారం బ్యారేజీకి 16,500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా బ్యారేజీ 66 గేట్లను ఎత్తి అంతేనీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఎన్‌డీఎస్‌ఏ తదుపరి ఆదేశాలు వచ్చే వరకు నీటినిల్వ చేయడం లేదని అధికారులు చెబుతున్నారు.

మేడిగడ్డ బ్యారేజీ వద్ద గోదావరి ప్రవాహం



సమ్మక్క సాగర్ బ్యారేజీలోకి వస్తున్న వరద నీరు



సమ్మక్క బ్యారేజీలో..

భారీ వర్షాల కారణంగా ములుగు జిల్లా కన్నాయిగూడెంలోని సమక్కసాగర్ బ్యారేజీలోకి 4,82,800 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. దీంతో బ్యారేలోని మొత్తం 59 గేట్లు ఎత్తి వచ్చిన నీటిని వచ్చినట్లు దిగువకు వదులుతున్నారు. బ్యారేజీ వద్ద 79.50 మీటర్లు నీటి ప్రవాహం నమోదైంది.

కురుస్తున్న రామప్ప దేవాలయం



రామప్ప దేవాలయంలో సజ్జల్ స్టోన్స్ నుంచి కారుతున్న వర్షపు చుక్కలు

వెంకటాపూర్(రామప్ప), జూలై 20: ప్రపంచ వారసత్వ సంపదగా యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప దేవాలయం కురుస్తోంది. తూర్పు, దక్షణం వైపున స్తంభాల నుంచి వర్షం నీరు చుక్కలుగా కారుతోంది. పైకప్పుపై సజ్జల్ స్టోన్‌గా పిలిచే రాళ్ల మధ్య ఏర్పడ్డ సందుల నుంచి నీరు కారుతున్నట్లు స్పష్టమవుతోంది. అలయ సందర్శనకు వస్తున్న పర్యాటకులు ఈ దృశ్యాలను చూసి ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

2022 జూలైలో కూడా భారీ వర్షాలకు ఇదే రీతిన ఆలయం కురిసింది. 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి స్పందించిన పురావస్తుశాఖ అధికారులు హుటాహుటిన రామప్పకు వచ్చి పరిశీలన జరిపారు. నక్షత్రాకార పీఠంపై విచ్చుకున్నట్లుగా నిర్మితమైన ఆలయం పైకప్పు శిథిలం కాలేదని, రాళ్ల మధ్య ఏర్పడ్డ సందుల నుంచి చుక్కలుగా నీరు కారుతోందని పురావస్తు శాఖ అసిస్టెంట్ కమిషనర్ స్మితా ఎస్.కుమార్ అప్పుడు వివరణ ఇచ్చారు. అయితే ఈ సమస్య పరిష్కారం కోసం సందులు వచ్చిన రాళ్లను కలుపుతూ వాటిని పోలిన రాళ్లను ఏర్పాటుచేయాలని యోచించారు. రూ.16లక్షలతో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఏపీలో అనంతపురం వద్ద రామప్పకు సరిపోలే రాళ్లను గుర్తించి వాటిని తెప్పించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. అయితే మరమ్మతు పనుల్లో జాప్యం కారణంగా వర్షం కురిసినప్పుడల్లా పైకప్పు నుంచి నీరు కారుతోంది. చివరిసారిగా 2015-16లో దంగుసున్నం, కరక్కాయ, ఇటుకలు, నల్లబెల్లం మిశ్రమంతో పైకప్పుకు మరమ్మతు చేశారు. 800 ఏళ్లనాటి ఈ పురాతన రాతికట్టడం పటిష్టతపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతున్న నేపథ్యంలో ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తింపు లభించినా పునరుద్ధరణ, పరి రక్షణ చర్యలలో నిర్లక్ష్యంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

పోలీసు అధికారులు అప్రమత్తంగా ఉండాలి : సీపీ

వరంగల్ క్రైం, జూలై 20: రెండు రోజులుగా కమిషనరేట్ పరిధిలో భారీ వర్షాలు కురుస్తున్న కారణంగా సహాయక చర్యలు అందించేందుకు పోలీసు అధికారులు అప్రమత్తంగా ఉండాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఒక ప్రకటనలో ఆదేశించారు. ఆయా స్టేషన్‌ల పరిధిలో వాగులు, చెరువుల నీటి ప్రవాహాన్ని క్షేత్రస్థాయిలో సందర్శించి చర్యలు తీసుకోవాలన్నారు. ట్రైసిటీస్ పరిధిలో, గ్రామాల పరిధిలో గతంలో ముంపునకు గురైన ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. వర్షాలకు ముంపునకు గురయ్యే అవకాశం ఉన్న ప్రాంతాలకు సహాయక చర్యలు అందించేందుకు ఇతర ప్రభుత్వ శాఖలతో కలిసి పనిచేయాలన్నారు. సిబ్బంది అందుబాటులో ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులకు అంబర్ కిషోర్ ఝా సూచించారు.

ఆహా ఏమి రుచి..

నగరంలో టిఫిన్స్‌కు పెరుగుతున్న క్రేజ్

హనుమకొండ టౌన్, జూలై 20: వరంగల్, హనుమకొండ, కాజీపేట (ట్రైసిటీ)లో అడుగు అడుగునా ఉన్న టిఫిన్ సెంటర్లకు ఆదరణ పెరుగుతున్నది. నాణ్యత, రుచి, కస్టమర్ల పట్ల మర్యాద తీరు, వివిధ రకాల వంటకాలతో కస్టమర్లను ఆకట్టుకుంటున్నారు. ప్రధానంగా హనుమకొండ చౌరస్తాలోని పప్పు పూరి, అలంకార్ నెయ్యి ఇడ్లీ, కేయూ క్రాస్‌లో సాంబర్ ఇడ్లీ, ఏకశిలాపార్కు ఎదుట వడ, బొండ, అంబేద్కర్ జంక్షన్, తిరుమల బార్, బొక్కలగడ్డ బ్రిడ్జి, లక్ష్మీ టాకీస్, చౌర్‌బౌళి, చింతల్‌బ్రిడ్జి, బట్టలబజార్ వెంకటేశ్వర్ల టెంపుల్, హంటర్‌రోడ్డు, కాజీపేట బాపూజీనగర్‌బ్రిడ్జి ఏరియాల్లో ఉన్న టిఫిన్ సెంటర్లల్లో దొరికే టిఫిన్స్ రుచిగా ఉంటాయని టిఫిన్‌ప్రియులు అంటున్నారు.

ఉరుకులు.. పరుగులు..

ప్రస్తుత జీవనం ఉరుకుల పరుగుల మీద నడుస్తోంది. క్షణం తీరికలేని పనులతో చాలామంది తమ జీవితాలను బీజీగా గడుపుతున్నారు. ఇంట్లో పనులు చేసుకునేందుకు వీలు లేనంతగా పొద్దున నిద్రలో నుంచి లేచినప్పటి నుంచి రాత్రి పడుకునే వరకు ఎవరిపనుల్లో వారు విరామం లేకుండా నిమగ్నమైపోతున్నారు. అలాగే ఉద్యోగరిత్యా సుదూర ప్రాంతాలకు వెళ్లే ఉద్యోగులకు ఆ సమయానికి ఇంట్లో టిఫిన్ తయారీ కాకపోవడం సమస్యగా మారింది. దీంతో ఇంట్లో తినలేకపోతున్నారు. అలాగే వివిధ ప్రాంతాల నుంచి చదువు, ఉద్యోగాల కోసం నగరానికి వచ్చి రూమ్‌లలో ఉంటున్న బ్యాచ్‌లర్స్‌కు చాలా మంది బయటదొరికే టిఫిన్ సెంటర్స్‌ను ఆశ్రయిస్తున్నారు. అంతేకాకుండా వరంగల్ నగరానికి వివిధ ప్రాంతాల నుంచి వస్తున్నవారు.. నగరం నుంచి వెళుతున్న వారు నిత్యం వేలల్లో ఉంటారు. ఈ క్రమంలో తమ తమ గమ్యస్థానాలకు చేరడానికి, బస్సు, రైళ్లను, వివిధ ప్రైవేటు వాహనాలను అందుకోవడానికి ఇంట్లో నుంచి హడావుడిగా బయలు దేరుతుంటారు. ఈ ఆదరాబాదరాలో ఇంట్లో అల్పాహారం తీసుకోరు. ఈ క్రమంలో నగరంలో అడుగుకొక్కటి వెలసిన టిఫిన్ సెంటర్లలో బ్రేక్ ఫాస్ట్ కానిస్తున్నారు.

రాత్రిళ్లలో కూడా..

రాత్రి వేళల్లో సైతం టిఫిన్ సెంటర్ల జోరు కనిపిస్తుంటుంది. విద్యార్థులు, ఉద్యోగులే కాకుండా కొందరు కుటుంబసమేతంగా బయటికొచ్చి రోడ్డు పక్కన ఉన్న టిఫిన్ సెంటర్ బండ్ల వద్ద తినడం షరా మామూలైపోయింది. ఇక రాత్రి వేళల్లో బస్టాండ్, రైల్వేస్టేషన్‌లల్లో ప్రయాణికులకు అక్కడే దొరికే బ్రెడ్ ఆమ్లెట్, వేడి వేడి ఇడ్లీలను ఆహారంగా తీసుకొని ప్రయాణం చేస్తున్నారు. ప్రయాణికులు ఒక్కరే కాదు.. పార్టీలు చేసుకొని అర్ధరాత్రి ఫుడ్ కోసం బయటకొచ్చే యువకులకు సైతం వేడివేడిగా దొరికే ఇడ్లీతో పాటు రైల్వేస్టేషన్‌ల సమీపంలో అర్ధరాత్రి దొరికే బ్రెడ్ ఆమ్లెట్‌ను ఇష్టపడి తింటున్నారు. ముఖ్యంగా హనుమకొండ చౌరస్తాలో అర్ధరాత్రి వరకు దొరికే చిన్న సైజ్ ఇడ్లీ ఫేమస్. చౌరస్తా చుట్టూరా ఆస్పత్రుల్లోని రోగులు, వారి బంధువులు, అర్ధరాత్రి బస్సు దిగొచ్చిన కుటుంబాలకు, బ్యాచిలర్స్‌కు చిన్న ఇడ్లీలే పరమాన్నం.

తృణధాన్యాలు వైపు..


కొంతమంది ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి తృణ ధాన్యాలు (మిల్లెట్స్) టిఫిన్స్ వైపు ఆసక్తి చూపిస్తున్నారు. అవి ఎక్కడ ఉన్నా తెలుసుకొని మరీ దూరమైనప్పటికి వెళ్లి తిని వస్తున్నారు. మరి కొంత మంది రుచులు చూడటానికి సైతం సందర్శించి తినేసి వస్తున్నారు. టిఫిన్ ప్రియుల అభిరుచుల తగ్గట్టుగా నగరంలో మిల్లెట్స్ టిఫిన్ సెంటర్స్ పెరిగిపోతున్నాయి. రాగి, సామలు, కొర్రలు, క్యారెట్‌లతో ఇడ్లీ, దోశ, పూరీలు చేసి వేడి వేడిగా అందిస్తున్నారు.

వాకర్స్ కోసం..

మార్నింగ్ వాక్‌లోనే రాగి, కొర్రలు, సామలతో తయారుచేసిన జావను టిఫిన్‌గా తీసుకొని రోజువారీ పనిలో భాగంగా ఎవరి పనులకు వారు వెళుతున్నారు. ప్రతీ గ్రౌండ్‌లో వాకింగ్‌కు ముందు ఈ జావాలు తీసుకోవడం సాధారణమైపోయింది. అయితే పబ్లిక్‌గార్డెన్ దగ్గర బొక్కలసూప్‌కు ప్రత్యేకత ఉంది. వివిధ పనుల కోసం పొద్దునే బయటికి వచ్చే వారితో పాటు వాకర్స్ దానినేబ్రేక్‌ఫాస్ట్‌గా తీసుకుంటున్నారు.

ఉదయాన్నే డ్యూటీకొస్తా..


ఈ.మాధవ్‌రావు, ట్రాఫిక్ పోలీస్



ఉదయం 8గంటల వరకు విధుల్లో చేరాలి. 7.40నిమిషాలకు పోలీస్‌స్టేషన్‌లో రూల్‌కాల్ ఉంటుంది కాబట్టి ఉదయాన్నే ఇంట్లో నుంచి డ్యూటీకి బయలుదేరుతాను. ఆ సమయంలో ఇంట్లో టిఫిన్ సిద్ధం కాదు. రూల్ కాల్ తర్వాత లేదా కొంత సమయం తర్వాత డ్యూటీ చేసే సిగ్నల్ పాయింట్ దగ్గర ఉన్న ఏదో ఒక టిఫిన్ సెంటర్‌లో టిఫిన్ చేస్తాను.

ఇంట్లో టిఫిన్ చేసే సమయం ఉండదు..

రాచమల్ల రవీందర్, బిల్డర్



వృత్తిరిత్యా బిల్డర్ కావడంతో ఉదయాన్నే పని వాళ్ల వచ్చేలోపు నిర్మాణ స్థలానికి చేరుకోవాల్సి ఉంటుంది. పక్క జిల్లాలో పనులు ఉంటే ఇంట్లో నుంచి ఉద యం 8గంట లకే అక్కడికి బయలు దేరుతాను. మధ్యాహ్నా భోజనం తీసుకెళతా.. టిఫిన్ మాత్రం మార్గమధ్యలో చేస్తా..

రోజూ బయటనే టిఫిన్ చేస్తా..

మాడిశెట్టి శ్రీను. ప్రైవేట్ ఉద్యోగి

వరంగల్‌లోని ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తాను. రోజూ గీసుగొండ మండలం నుంచి బైకుపై వస్తుంటాను వ్యవసాయ కుటుంబం కావడంతో ఇంట్లో టిఫిన్స్ చేయరు. పొద్దున్నే అన్నం వండటంతో లంచ్‌బాక్స్‌తో బయలుదేరుతాను. ఉదయం వరంగల్‌లో టిఫిన్ చేస్తాను. లక్ష్మీటాకీస్ సమీపంలో బోండా భలే రుచిగా ఉంటుంది.



అదుపుతప్పి జీపు బోల్తా

శంభునిపేట, జూలై 20 : ఓ జీపు అదుపుతప్పి బోల్తా పడిన సంఘటన ఖిలావరంగల్ మండలంలోని గుంటూరుపల్లిలో జరిగింది. నెక్కొండ నుంచి వరంగల్‌కు వస్తున్న జీపు గుంటూరుపల్లి సమీపంలో అదుపు తప్పి రోడ్డుపైనే బోల్తా పడింది. డ్రైవర్ సడన్‌గా బ్రేక్ వేయటం వల్లనే ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. జీపులో డ్రైవర్‌తో పాటు నలుగురు ప్రయాణికులు ఉన్నారు. ఎక్కువ వేగం లేకపోవటంతో పెద్ద ప్రమాదం తప్పినట్లైంది. ఇద్దరికి స్వల్ప గాయాలు కాగా, మిగతా వారికి ఎలాంటి ప్రమాదం జరుగలేదు. గాయపడిన వారిని మరో వాహనంలో ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకొని సంఘటనా స్థలానికి వచ్చిన మామునూరు ఎస్ఐ కృష్ణవేణి పరిశీలించి రోడ్డుకు అడ్డుగా ఉన్న జీపును పక్కకు తప్పించి రాకపోకలను కొనసాగించారు. ఈ సంఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

జిల్లాలో 24.9 మి.మీ వర్షపాతం నమోదు

వరంగల్ కలెక్టరేట్, జూలై 20: జిల్లాలో గత రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా ముసురు పడుతోంది. అక్కడక్కడా ఓ మోస్తరు వర్షం కురిసింది. గత 24 గంటల్లో జిల్లాలో 24.9 మి.మీ వర్షపాతం నమోదైంది. వరంగల్ జిల్లాలోని మొత్తం 13 మండలాల్లో కలిపి 323.6 మి.మీ వర్షం కురిసినట్లు వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. దాదాపు అన్ని మండలాల్లో ఒకేలా 22 మి.మీ నుంచి 28 మి.మీ మధ్య వర్షం కురిసింది. ఖానాపూర్ మండలంలో కాస్త ఎక్కువ వర్షం పడింది. మిగతా మండలాలలో సాధారణ వర్షపాతం నమోదైంది. గీసుగొండలో 25.6 మి.మీ, దుగ్గొండిలో 26.2 మి.మీ, నల్లబెల్లిలో 22.4 మి.మీ, నర్సంపేటలో 24.6 మి.మీ, ఖానాపూర్‌లో 28.4 మి.మీ, చెన్నారావుపేటలో 25.4 మి.మీ, సంగెంలో 23 మి.మీ, వర్ధన్నపేటలో 26.4 మి.మీ, రాయపర్తిలో 16.8 మి.మీ, పర్వతగిరిలో 23.8 మి.మీ, నెక్కొండలో 26.4 మి.మీ, ఖిలావరంగల్‌లో 28.2 మి.మీ, వరంగల్‌లో 26.4 మి.మీ వర్షం పడినట్టు అధికారులు తెలిపారు. రానున్న రెండు రోజులు కూడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్టు వాతావరణ శాఖ అధికారులు హెచ్చరించారు.

వరంగల్ అభివృద్ధిలో ఎస్‌బీఐ ముందంజ

జనరల్ మేనేజర్ ప్రకాశ్‌చంద్ర భరోర్



పాలసీదారు భార్య మాధవికి చెక్కు అందిస్తున్న ఎస్‌బీఐ జీఎం

గిర్మాజీపేట, జూలై 20 : అన్ని వర్గాల ప్రజల అవసరాలకు అనుగుణంగా వ్యాపారంలోనే కాకుండా వరంగల్ అభివృద్ధిలోను భారతీయ స్టేట్ బ్యాంకు ముందుంటుందని ఎస్‌బీఐ నెట్‌వర్క్-2 జనరల్ మేనేజర్ ప్రకాశ్‌చంద్ర భరోర్ అన్నారు. ఆధార్‌కార్డుకు అనుసంధానమైన మొబైల్ నెంబర్ ఉంటే తక్షణం బ్యాంకులో అకౌంట్ తెరువవచ్చన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులోను ఎస్‌బీఐ అగ్రస్థానంలో ఉందని చెప్పారు.

శనివారం వరంగల్ జేపీఎన్ రోడ్డులో ఉన్న బ్యాంకు వరంగల్ పరిపాలనా కార్యాలయంలో డిప్యూటీ జనరల్ మేనేజర్ ఘన్‌శ్యామ్ సోలంకి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో గుండెపోటుతో మృతి చెందిన ఎస్‌బీఐ లైఫ్ రిన్‌రక్షా పాలసీదారుల కుటుంబసభ్యులు మాధవి రాజుకు రూ.11.50 లక్షలు, ఉమమహేశ్వర్‌కు రూ.38,27,500 చెక్కులను జనరల్ మేనేజర్ ప్రకాశ్‌చంద్ర భరోర్ అందజేసి మాట్లాడారు. ఎస్‌బీఐ వరంగల్ పరిపాలనా జోన్ పరిధిలో వరంగల్, హనుమకొండ, కరీంనగర్, సిరిసిల్ల, ములుగు, జనగామ, జయశంకర్ భూపాలపల్లి, మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో 186 ఎస్‌బీఐ శాఖలు, నాలుగు ప్రాంతీయ కార్యాలయాలు ప్రజలకు బ్యాంకింగ్ సేవలను అందిస్తున్నట్లు చెప్పారు. గత ఆర్థిక సంవత్సరంలో 9 జిల్లాల్లో 19వేల 200 కోట్ల రూపాయల రుణాలిచ్చామని, ఇందులో వ్యవసాయ రంగానికిరూ.5,200 కోట్లు, వ్యాపారాలకు రూ.2,600 కోట్లు, ఇతర రంగాలకు రూ.11వేల కోట్ల రుణాలు ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ రాస్‌మెక్ శాఖ సహాయ జనరల్ మేనేజర్ రాజేంద్రకుమార్, ప్రాంతీయ మేనేజర్ విష్ణువర్ధన్, వరంగల్ అర్బన్ ఎస్‌బీఐ లైఫ్ జోనల్ ఏరియా మేనేజర్ కమలాకర్ తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు బ్యాంకు అధికారులతో జనరల్ మేనేజర్ ప్రకాశ్‌చంద్ర భరోర్ సమావేశమయ్యారు.

జోరందుకున్న వ్యవసాయ పనులు

వర్షాలతో నిండుతున్న చెరువులు, కుంటలు

పొలం పనుల్లో రైతులు బిజీబిజీ

వరంగల్ వ్యవసాయం, జూలై 20: జిల్లాలో భారీ వర్షాలకు జలకళ ఉట్టిపడుతోంది. విస్తారంగా వర్షాలు కురుస్తుండటంతో వాగులు, వంకలు, చెరువులు, కుంటలు వరద నీటితో కళకళ లాడుతున్నాయి. జిల్లాలో ప్రధాన నీటి ప్రాజెక్టు పాకాల సరస్సులోకి ఇప్పటికే 20.9 అడుగుల మేర నీరు చేరింది. పెద్ద ఎత్తున జనాలు సరస్సు నీటిని చూసేందుకు చేరుకుంటున్నారు. మరోపక్క రైతులు పొలం పనుల్లో తీరిక లేకుండా ఉన్నారు. జిల్లాలో ముఖ్యంగా వరి, పత్తి, మిర్చి, మొక్కజొన్న, కంది, పల్లి పంటలు ఎక్కువగా సాగు చేస్తారు. ఇటీవల కురుస్తున్న వర్షాలు ఆయా పంటలకు అనుకూలంగా ఉండడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. బావుల కింద ఇప్పటికే వరినార్లు పోసుకోగా, చెరువులు, కుంటల కింద ఇప్పుడిప్పుడే నార్లు అలుకుతున్నారు. పత్తి పంటకు వర్షాలు చాలా వరకు ఉపయోగపడుతున్నాయి. మొత్తానికి వ్యవసాయ సాగు పనులు ఊపందుకున్నాయి.

నిండుతున్న పాకాల చెరువు

జిల్లాలో అతిపెద్ద పాకాల సరస్సు నీటి మట్టం 30 అడుగులు కాగా, భారీ వర్షాలకు ఇప్పటికే 20.9 అడుగులకు నీరు చేరింది. ఈ సరస్సు కింద సుమారు 30వేల ఎకరాలలో రైతులు వరి పంట సాగు చేస్తారు. భారీగా నీరు చేరుడంతో రైతులు పొలం పనుల్లో బిజీ అయ్యారు. వరి నార్లు పోస్తున్నారు. పొలాలు దున్నడం, గెట్లు పెట్టడం చేస్తున్నారు. కొందరు రైతులు నాట్లు కూడా వేస్తున్నారు.

సన్నాలకే ప్రాధాన్యత

కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక సన్నాలకు బోనస్ రూ.500 ప్రకటించడంతో రైతులు సన్నాలకే ప్రాధాన్యత ఇస్తున్నారు. జిల్లాలో సుమారు 1.30వేల ఎకరాలలో వరి సాగు చేయనున్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు. ఇందులో ఎక్కువ శాతం రైతులు సన్నాలు సాగు చేయడానికే ముందుకు సాగుతున్నారు. ధాన్యానికి కనీస మద్దతు ధర రూ.2,203 ఉండగా ఇటీవల కేంద్ర ప్రభుత్వం ధాన్యానికి కనీస మద్దతు ధర రూ.2,320 లకు పెంచింది. ఈ ధరలు రానున్న సెప్టెంబరు నుంచి అమలులోకి రానున్నాయి. మద్దతు ధర రూ.2,320తోపాటు రాష్ట్ర ప్రభుత్వం అందించే రూ.500 బోనస్‌తో కలిపితే క్వింటా ధాన్యానికి రూ.2,820 పలుకుతుందని రైతులు లెక్కలేసుకుని సన్నవడ్లను సాగు చేసేందుకే ఇష్టపడుతున్నారు.



జలకళను సంతరించుకున్న పాకాల సరస్సు

బండ్ ప్రాంతాన్ని ఎఫ్‌టీఎల్ నుంచి మినహాయించాలి

● భద్రకాళి బండ్ ఏరియా కమిటీ అధ్యక్షుడు రవీందర్



హంటర్‌రోడ్డు జంక్షన్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న కాలనీ వాసులు

మట్టెవాడ, జూలై 20: భద్రకాళి చెరువు ఫోర్ షోర్ బండ్ ప్రాంతాన్ని ఎఫ్‌టీఎల్ నుంచి మినహాయించాలని, భద్రకాళి బండ్ ప్రాంతాన్ని రెసిడెన్షియల్ జోన్‌గా మార్చాలని భద్రకాళి బండ్ ఏరియా కమిటీ అధ్యక్షుడు మర్రి రవీందర్ అన్నారు. శనివారం వరంగల్ హంటర్‌రోడ్డు 12 మోరీల జంక్షన్ వద్ద బృందావన్ కాలనీ, సంతోషిమాత కాలనీ, సాయినగర్ కాలనీ తదితర కాలనీ వాసులు కూల్చివేతలపై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భద్రకాళి చెరువు ఫోర్ షోర్ బండ్ ప్రాంతాన్ని రెసిడెన్షియల్ జోన్‌గా మార్పు చేయాలని పలుమార్లు ప్రభుత్వాలకు, అధికారులకు, ప్రజాప్రతినిధులకు విజ్ఞప్తి చేశామన్నారు. ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు చేపట్టకుండా కార్పొరేషన్ అధికారులు నోటీసులు జారీ చేశారని పేర్కొన్నారు. కుడా అధికారులు డీపీ నెంబర్ 9/99 , సర్వే నెంబరు 649లో ఉన్న భద్రకాళి చెరువు ఫోర్ షేర్ బండ్ ప్రాంతంలో 36 మందికి లేఔట్ చేసి భూమి పట్టాలు ఇచ్చారన్నారు. పట్టాలు పొందిన వారు 24 సంవత్సరాల నుంచి నివాసం ఏర్పాటు చేసుకున్నారని తెలిపారు. 1997లో అప్పటి మునిసిపల్ కమిషనర్ అరవింద్ కుమార్ ప్రత్యేక అధికారి కుడాగా ఉన్న సమయంలో హంటర్‌రోడ్ నిర్వాసితులతో సమావేశం నిర్వహించారని తెలిపారు. అందులో హంటర్‌రోడ్ భద్రకాళి బండ్ ఇరువైపులా నివాసితుల, భూమి యజమానుల గృహాలు, స్థలాలను రూలర్ చేయడానికి భద్రకాళి చెరువు ఫోర్ షోర్ బండ్ డెవలప్‌మెంట్ ఫండ్‌కు కనీసం రూ.2వేలు ప్రతి వ్యక్తి చెల్లించాలని చెప్పడంతో అప్పుడు గృహ, ప్లాట్ల యజమానులు చెల్లించారన్నారు.

1996-97లో భద్రకాళి చెరువు, గ్రేటర్ వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్‌కు సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌గా మార్చబడిందని రవీందర్ తెలిపారు. ఫోర్ షోర్ బండ్ నిర్మాణం తరువాత, నీటి విస్తరణ, ప్రాంతం బండ్ లోపల మాత్రమే పరిమితమైంది. కానీ, ఇప్పటి వరకు అధికారులు ఎఫ్‌టీఎల్ హద్దులు మార్చలేదన్నారు. గిరిజన విజ్ఞానపీఠం భవనం 2002లో నిర్మించారని దీంతో ఫోర్ షోర్ బండ్ హంటర్‌రోడ్ ఇరువైపులా ప్రాంతానికి ప్రాముఖ్యత పెరిగిందని, గ్రేటర్ వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్ ద్వారా బిల్డింగ్ అనుమతులు, సీసీ రోడ్లు, డ్రైనేజీలు, విద్యుత్ లైన్లు ఏర్పాటు చేశారని తెలిపారు. ఇప్పుడు దాదాపుగా అన్ని ప్రాంతాలు నివాస గృహాలు నిర్మించారని, కమర్షియల్ భవనాలు నిర్మించారని, ఇంకా ఎఫ్‌టీఎల్ జోన్ కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో ఫోర్ ఫోర్ బండ్ బహిరంగ ప్రాంతాన్ని రెసిడెన్షియల్ జోన్‌గా మార్చాలని సంబంధిత అధికారులకు, ప్రజాప్రతినిధులకు విజ్ఞప్తి చేశామని తెలిపారు. వరద కాల్వ ముంపుకు గురికాకుండా శాశ్వత చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. కార్పొరేషన్ అధికారులు జారీ చేసిన నోటీసులను వెంటనే ఉపసంహరించుకోవాలని, వరద నీరు సాఫీగా వెళ్లేందుకు ప్రస్తుతం తాత్కాలిక చర్యలను చేపట్టాలని కోరారు. ఈ నిరసనలో హంటర్‌రోడ్ భద్రకాళి బండ్ కాలనీవాసులు పాల్గొన్నారు.



వామపక్షాల రౌండ్ టేబుల్ సమావేశం దృశ్యం

25న వామపక్షాల జిల్లా సదస్సు

గిర్మాజీపేట, జూలై 20 : వరంగల్ శివనగర్‌లోని సురేందర్ భవన్‌లో ఈనెల 25న జరిగే వామపక్షాల జిల్లా సదస్సును విజయవంతం చేయాలని వామపక్షాల నాయకులు రంగయ్య, కుమారస్వామి, బాలరాజు, సూరి పిలుపునిచ్చారు. శనివారం అండర్‌బ్రిడ్జి సమీపంలోని ఓంకార్ భవన్‌లో ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్ అధ్యక్షతన జరిగిన వామపక్షాల రౌండ్ టేబుల్ సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి రంగయ్య, ఎంసీపీఐ(యూ) కేంద్ర కమిటీ సభ్యుడు గోనె కుమారస్వామి, న్యూడెమోక్రసీ జిల్లా నాయకుడు ఆర్.బాలరాజు, సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి చిర్ర సూరిలు పాల్గొని దేశంలో పెరుగుతున్న మోదీ ప్రభుత్వ మతోన్మాద విధానాలపై విస్తృతంగా చర్చించారు. మతోన్మాద చర్యలు, విధానాలకు నిరసనగా చేపట్టాల్సిన ప్రజా ఉద్యమాలపై 25న జరిగే వామపక్షాల జిల్లా సదస్సులో చర్చించనున్నట్లు వారు పేర్కొన్నారు.

మత్స్యకారుల అభివృద్ధికి ప్రభుత్వం పాటుపడాలి

తెలంగాణ ముదిరాజ్ మహాసభ నాయకులు



తహసీల్దార్ కార్యాలయానికి ర్యాలీగా వెళ్తున్న ముదిరాజ్ కులస్థులు

ఖిలావరంగల్, జూలై 20: రాష్ట్రంలోని మత్స్యకారుల అభివృద్ధికి ప్రభుత్వం పాటుపడాలని తెలంగాణ ముదిరాజ్ మహాసభ అర్బన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పులి రజినీకాంత్, నగర అధ్యక్షుడు సంగరబోయిన ఉమేష్ అన్నారు. శనివారం తెలంగాణ ముదిరాజ్ రాష్ట్ర మహాసభ పిలుపు మేరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేసే చేపపిల్లలకు బదులు నగదును బదిలీ చేస్తే ముదిరాజ్‌లకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ముదిరాజ్ ఫైనాన్స్‌గా కమిషన్ ఏర్పాటు చేసి 1000 కోట్ల నిధులు కేటాయించాలన్నారు. చెరువులు, కుంటలపై ముదిరాజ్‌లకు సంపూర్ణ హక్కులు కేటాయించాలన్నారు. మంత్రివర్గ విస్తరణలో ముదిరాజ్‌లకు స్థానం కల్పించాలని కోరారు. ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చినట్లుగా బీసీ-డీ నుంచి బీసీ-ఏ కులంలోకి మార్చడానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తక్షణం కృషి చేయాలన్నారు. ముందుగా ఖిలావరంగల్ పెట్రోల్ పంపు వద్ద నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా చేరుకుని తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ముదిరాజ్ మహాసభ ఎన్ఆర్ఐ రాష్ట్ర అధ్యక్షుడు చొప్పరి సోమన్న, జిల్లా ఉపాధ్యక్షుడు సంగరబోయిన చందర్, నాయకులు శానబోయిన రాజ్‌కుమార్, బుస్స వెంకన్న, నర్ర ప్రతాప్, సిరబోయిన వాసుదేవ్, రావుల రాజేష్, బొల్ల కుమారస్వామి, మేకల కుమార్, గీకురు సారంగపాణి, బండి రాజు, రమేష్, మోహన్‌బాబు, బోళ్ల రాజు, లక్ష్మి, సారయ్య, నారాయణ, సాంబయ్య, భరత్, సూరయ్య, కుమారస్వామి, రాములు తదితరులు పాల్గొన్నారు.

ఏకలవ్య వాడలో అమ్మ మాట-అంగన్‌వాడీ బాట



ఏకలవ్య వాడలో ప్రీ స్కూల్ విద్యార్థులకు అక్షరాభ్యాసం చేయిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, సీడీపీవో విశ్వజ

వరంగల్ సిటీ, జూలై 20: నగరంలోని 19వ డివిజన్ కాశిబుగ్గ ఏకలవ్య వాడలోని అంగన్‌వాడీ కేంద్రంలో అమ్మ మాట-అంగన్‌వాడీ బాట కార్యక్రమాన్ని చేపట్టారు. రామన్నపేట సెక్టార్ అంగన్‌వాడీ కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు, ప్రీ స్కూల్ విద్యార్థుల సమక్షంలో నిర్వహించారు. సూపర్‌వైజర్ ఛాయాదేవి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీడీపీవో విశ్వజ హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రీ స్కూల్ విద్యార్థులకు అక్షరాభ్యాసం చేయించారు. గర్భిణులకు సీమంతాలు, అన్నప్రాసన చేశారు. అదేవిధంగా మొక్కలు నాటి బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో టీచర్లు ఎండి.నజీమా, కె.భవానీ, బి.స్రవంతి, వాణి, కవిత, సారిక తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపాలన సేవా కేంద్రాలతో ఎంతో మేలు



ప్రజాపాలన కేంద్రాన్ని సందర్శించిన సీఈవో రాంరెడ్డి

వర్ధన్నపేట, జూలై 20 : ప్రజాపాలన సేవా కేంద్రాలతో ప్రజలకు ప్రభుత్వ పథకాలు అందేందుకు దోహదపడుతుందని వరంగల్ జెడ్పీ సీఈవో రాంరెడ్డి అన్నారు. శనివారం వర్ధన్నపేట ఎంపీడీవో కార్యాలయంలో ఉన్న ప్రజాపాలన సేవా కేంద్రాన్ని సందర్శించి ఫైళ్లలను పరిశీలించి తగు సూచన లు చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రజాపాలన సేవా కేంద్రాల్లో దరఖాస్తులను వెంటనే ఆన్‌లైన్‌లో నమోదుతోపాటు తప్పులను సరిచేసి పంపించాలని కోరారు. ప్రజలకు ఇబ్బందులు కలుగవద్దనే ఆలోచనతో ప్రభుత్వం ఏర్పాటు చేసిందని, ఈ విషయాన్ని అధికారులు అర్థం చేసుకుని అందుకనుగుణంగా ముందుకు సాగాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో ధనలక్ష్మి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సెంట్రల్ విజిలెన్స్ కమిషన్

కమిటీ సభ్యుడిగా ప్రభాకర్



సర్టిఫికెట్‌తో ప్రభాకర్

ఖిలావరంగల్, జూలై 20: సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ రాష్ట్ర కమిటీ సభ్యుడిగా వరంగల్ జిల్లాకు చెందిన కొయ్యడ (కరాటే) ప్రభాకర్‌ను నియమించినట్లు రాష్ట్ర అడిషనల్ సెక్రెటరీ పి.డానియల్ ఉత్తర్వులు జారీ చేశారు. శనివారం ఆయన సర్టిఫికెట్‌ను అందుకున్నారు. దేశ సమగ్రతను కాపాడేందుకు చట్ట పరిధిలోని సమస్యలను కేంద్ర సెంట్రల్ విజిలెన్స్ కమిషన్, రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లవచ్చునన్నారు. ఈ సందర్భంగా సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ రాష్ట్ర అడిషనల్ సెక్రెటరీ డానియల్, సభ్యులకు ప్రభాకర్ కృతజ్ఞతలు తెలిపారు.

ఆలయాల్లో శాకంబరీ వేడుకలు



ఎంజీఎం సెంటర్‌లోని రాజరాజేశ్వరి ఆలయంలో శాకంబరీ అలంకరణలో అమ్మవారు

వరంగల్ కల్చరల్, జూలై 20: నగరంలోని ఆలయాల్లో శనివారం శాకంబరీ వేడుకల పూజలు నిర్వహించారు. ములుగు రోడ్‌లోని శ్రీవరద దత్తక్షేత్రంలో శ్రీమహాలక్ష్మి అమ్మవారిని వివిధ రకాల కాయకూరలు, ఆకుకూరలు, పండ్లు, పూలతో అలంకరించి కుంకుమ పూజ, లలితాపారాయణం జరిపారు. మహా మంగళహారతి నివేదన అనంతరం భక్తులకు తీర్థప్రసాద వితరణ జరిగింది. ఎంజీఎం సెంటర్‌లోని శ్రీరాజ రాజేశ్వరి దేవాలయంలో అమ్మవారికి శాకంబరీ అలంకరణను నిర్వహించి భక్తుల దర్శనానికి ఏర్పాటు చేశారు. అనంతరం ప్రసాద వితరణ జరిగింది. దత్తక్షేత్రంలో ప్రధానార్చకులు రాపాక గోపీకృష్ణశర్మ ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు వైవీ వామన్‌రావు, ప్రొఫెసర్ కృష్ణప్రసాద్, డాక్టర్ వొద్దిరాజు శార్వాణి, కేతిరెడ్డి విజేందర్ రెడ్డి, జూలూరి శ్రీనివాస్, వడిచర్ల శ్రీనివాస్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

హైకోర్టు జడ్జిని కలిసిన బార్ ప్రతినిధులు



జస్టిస్ భట్టాచార్యను కలిసి మొక్క అందజేస్తున్న బార్ ప్రతినిధులు

వరంగల్ లీగల్, జూలై 20: హనుమకొండ, వరంగల్ జిల్లాల బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వరంగల్, హనుమకొండ జిల్లా పోర్ట్ పోలియో జడ్జి, రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మౌసమి భట్టాచార్యను శనివారం కలిశారు. ఈ సందర్భంగా వేర్వేరుగా వినతి పత్రాలను అందజేశారు. వరంగల్ జిల్లాకు సంబంధించిన కోర్టులను వరంగల్ జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేయాలని వరంగల్ జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తీగల జీవన్‌గౌడ్ విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా వరంగల్ జిల్లాకు ప్రత్యేక ఫ్యామిలీ కోర్టును ఏర్పాటు చేయాలని, ఖాళీగా ఉన్న న్యాయశాఖ ఉద్యోగ స్థానాలను భర్తీ చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా హనుమకొండ జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మాతంగి రమేష్‌బాబు జస్టిస్ భట్టాచార్యకు వినతిపత్రం అందిస్తూ త్వరలో హనుమకొండ జిల్లాకు ప్రత్యేక ఫోక్సో కోర్టును ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. వరంగల్, హనుమకొండ కోర్టుల కార్యకలాపాల సమీక్షకు విచ్చేసిన జస్టిస్ భట్టాచార్యను కోర్టు ప్రాంగణంలో ఇరు బార్ అసోసియేషన్ల ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో హనుమకొండ బార్ అసోసియేషన్ కార్యదర్శి లాదె రమేష్, ఉపాధ్యక్షులు పోషిని రవీందర్, కార్యవర్గ సభ్యులు విజేందర్, చిరంజీవి, కవిత, సురేందర్‌రెడ్డి, తండమల్ల శ్రీనివాస్, వరంగల్ బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ముదసర్ అహ్మద్, అనిల్, సునిల్ తదితరులు పాల్గొన్నారు.

పేద కుటుంబానికి గ్రామస్థుల చేయూత



లింగం కుటుంబానికి ఆర్థిక సహాయం అందిస్తున్న గ్రామస్థులు

సంగెం, జూలై 20: మండలంలోని మొండ్రాయి గ్రామానికి చెందిన ఏడాకుల లింగం ఇటీవల మృతి చెందగా పలువురు గ్రామస్థులు ఆ కుటుంబానికి అండగా నిలిచారు. లింగం, భార్య కాంతి వ్యవసాయ కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతూ ఇటీవల లింగం ఆత్మహత్యకు పాల్పడటంతో కుటుంబానికి అండగా నిలిచేందుకు గ్రామస్థులు విరాళాలుగా సేకరించిన మొత్తంను శనివారం అందించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కడుతూరి సంపత్, అనుముల కుమారస్వామి, పెండ్లి పురుషోత్తం, కక్కెర్ల వీరస్వామి, సదయ్య, రాములు, భద్రయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఏకశిల స్కూల్‌లో విద్యార్థి లీడర్ ఎన్నికలు



పాఠశాలలో ఓటు వేసేందుకు వెళ్తున్న విద్యార్థులు

ఖిలావరంగల్, జూలై 20: ప్రతి ఒక్కరూ ఓటుహక్కు ద్వారా తమ లీడర్‌ను ఎన్నుకోవచ్చునని ఏకశిల విద్యాసంస్థల చైర్మన్ గౌరు తిరుపతిరెడ్డి అన్నారు. శనివారం వరంగల్ శివనగర్‌లోని ఏకశిల డీజీ స్కూల్‌లో డైరెక్టర్ బేతి కొండల్‌రెడ్డి ఆధ్వర్యంలో స్కూల్ విద్యార్థి లీడర్ ఎన్నికలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశం ఎన్నికల నియమావళిని వివరిస్తూ ఓటు అనేది ప్రతి వ్యక్తి చేతిలోని ఆయుధమని తెలిపారు. మన ఓటుతో ప్రజాస్వామ్యంలో సరైన నాయకుడిని ఎన్నుకున్నట్లే పాఠశాలలో సైతం లీడర్‌ను ఎన్నుకోవాలన్నారు. పాఠశాలలో గత వారం రోజులుగా నాయకత్వ లక్షణాలు కలిగి ఉన్న విద్యార్థులు కొందరు స్కూల్ పీపుల్ లీడర్, ఇన్‌చార్జ్ స్కూల్ పీపుల్ లీడర్‌గా నిలబడటానికి ఎంతో ఉత్సాహంతో పోటీపడి నామినేషన్లు వేయడానికి సిద్ధపడ్డారన్నారు. నామినేషన్లు వేసి విద్యార్థులు రెండు రోజులుగా ఒక్కొక్క విధంగా వారు చేపట్టే కార్యక్రమాలను విద్యార్థులకు, పాఠశాల అభివృద్ధికి దోహదపడే విధానాలను ఉపాధ్యాయులకు, విద్యాసంస్థ మేనేజ్‌మెంట్‌కు తెలియజేశారన్నారు. శనివారం పాఠశాలలో పీపుల్ లీడర్ ఎన్నికలను నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ బేతి కొండల్‌రెడ్డి, ప్రిన్సిపాల్ లవకుమార్, ఉపాధ్యాయులు, నాన్ టీచింగ్, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు భద్రకాళికి శాకంబరీ అలంకరణ

పది టన్నుల కూరగాయలు, పండ్లు వినియోగం

ఆలయంలో పూర్తి ఏర్పాట్లు చేసిన అధికారులు



అమ్మవారి అలంకరణకు కూరగాయలను దండగా తయారుచేస్తున్న సేవా సమితి మహిళలు

వరంగల్ కల్చరల్, జూలై 20: వరంగల్ నగరంలో కొలువుదీరిన భద్రకాళి అమ్మవారి ఆలయంలో శాకంబరీ ఉత్సవాలు ఎంతో వైభవంగా జరుగుతున్నాయి. 16 రోజుల పాటు జరిగే వేడుకల్లో ఆఖరి రోజు ఆదివారం పౌర్ణమి సందర్భంగా ఆషాఢ శుద్ధ పౌర్ణమి శాకంబరీ అలంకరణ అత్యంత వైభవోపేతంగా జరుగుతుంది. దేశ నలుమూలల నుంచి తెప్పించిన కూరగాయలు, ఆకుకూరలు, పండ్లతో అమ్మవారిని శాకంబరీగా అలంకరించి పూజలు నిర్వహించి భక్తుల దర్శనానికి ఏర్పాట్లు చేస్తారు. దాదాపు లక్ష మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుంటారని ఆలయ వర్గాలు అంచనా వేశాయి. ఇందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

10 టన్నుల కూరగాయలతో అలంకరణ

భద్రకాళి అమ్మవారిని శాకంబరీగా అలంకరణ చేసేందుకు 10 టన్నుల కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు వినియోగించనున్నారు. దీంతో ప్రకృతి మాతగా అమ్మవారు దర్శనమిస్తారు. దాతలు, భక్తుల నుంచే కాకుండా దేవాలయం నుంచి కూడా కూరగాయలు కొనుగోలు చేసి అలంకరిస్తారు. అమ్మవారిని అలంకరించడానికి శనివారం రాత్రి నుంచే అర్చక బృందం కార్యక్రమాన్ని ప్రారంభించింది. సేవా సమితికి చెందిన 200 మంది మహిళలు సాయంత్రం 5 గంటల నుంచి కూరగాయలను మాలలుగా తయారు చేయడం ప్రారంభించారు. ఉదయం వరకు అలంకరణ పూర్తయి మహా మంగళహారతి అనంతరం భక్తుల దర్శనానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

నాలుగు రకాల దర్శనాలు

అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు నాలుగు రకాలుగా దర్శనం ఏర్పాట్లను దేవాలయ సిబ్బంది ఏర్పాటు చేస్తున్నారు. ఉచితంగా ధర్మ దర్శనం, రూ.50 టికెట్‌తో శీఘ్ర దర్శనం, రూ.100తో అతి శీఘ్ర దర్శనంతో పాటు వీఐపీల దర్శనానికి ఏర్పాట్లు చేస్తున్నారు. అలాగే శనివారం శాకంబరీ అలంకరణ కోసం మహబూబాబాద్ జిల్లాకు చెందిన లక్ష్మీ వేంకటేశ్వర సేవా సమితికి చెందిన 2,500 మంది భక్తులు వరంగల్ పోచమ్మమైదాన్ నుంచి భద్రకాళి అమ్మవారి ఆలయం వరకు శనివారం కూరగాయలతో ర్యాలీ నిర్వహించారు. ఆదివారం శాకంబరీ సందర్భంగా అమ్మవారి అలంకరణ కోసం ప్రతి ఒక్కరూ కొన్ని కూరగాయలతో ర్యాలీగా వచ్చి దేవస్థానం వద్ద ప్రధానార్చకులు భద్రకాళి శేషు, ఈవో శేషు భారతికి అందించారు.

ఉచితంగా ప్రసాద వితరణ

అమ్మవారి దర్శనానికి తరలివచ్చే వేలాది మంది భక్తులకు ఉచితంగా ప్రసాదాన్ని అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. వరంగల్‌లోని భద్రకాళి సేవా సమితి అధ్యక్షుడు ఐత గోపీనాథ్ ఆధ్వర్యంలో 6.5 క్వింటాళ్ల ప్రసాదాన్ని తయారు చేసి ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులకు అందజేయనున్నారు. ఆలయంలో విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి భోజనాలకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఆలయ సిబ్బంది, పోలీసులతో పాటు 200 మంది సేవా సమితి వలంటీర్లను భక్తులకు సేవలందించడానికి వినియోగిస్తున్నట్లు ఈవో శేషు భారతి తెలిపారు.



ఆంధ్రజ్యోతి WARANGAL RURAL ఆదివారం 21 జూలై 2024

వరంగల్ రూరల్

ప్రజాపాలన సేవా కేంద్రాలతో ఎంతో మేలు



ప్రజాపాలన కేంద్రాన్ని సందర్శించిన జడ్పీ సీఈవో రాంరెడ్డి

వర్ధన్నపేట, జూలై 20 : ప్రజాపాలన సేవా కేంద్రాలతో ప్రజలకు ప్రభు త్వ పథకాలు అందేందుకు దోహదపడుతుందని వరంగల్ జెడ్పీ సీఈవో రాంరెడ్డి అన్నారు. శనివారం వర్ధన్నపేట ఎంపీడీవో కార్యాలయంలో ఉన్న ప్రజాపాలన సేవా కేంద్రాన్ని సందర్శించి ఫైళ్లలను పరిశీలించి తగు సూచన లు చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రజాపాలన సేవా కేంద్రాల్లో దరఖాస్తులను వెంటనే ఆన్‌లైన్‌లో నమోదుతోపాటు తప్పులను సరిచేసి పంపించాలని కోరారు. ప్రజలకు ఇబ్బందులు కలుగవద్దనే ఆలోచనతో ప్రభుత్వం ఏర్పాటు చేసిందని, ఈ విషయాన్ని అధికారులు అర్థం చేసుకుని అందుకనుగుణంగా ముందుకు సాగాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో ధనలక్ష్మి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రైతుల డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం

• అదనపు కలెక్టర్ సంధ్యారాణి



అదనపు కలెక్టర్ సంధ్యారాణికి డిమాండ్ల పత్రాన్ని అందిస్తున్న రైతులు

పర్వతగిరి, జూలై 20 : గ్రీన్‌ఫీల్డ్ హైవేలో భూములు కోల్పోతున్న రైతుల డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని అదనపు కలెక్టర్ సంధ్యారాణి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని రెవెన్యూ కార్యాలయంలో గ్రీన్ ఫీల్డ్ హైవే బాధిత రైతులతో ఆమె సమావేశమయ్యారు. వారి డిమాండ్లను తెలుసుకున్నారు. హైవే నిర్మాణంలో భాగంగా తమ విలువైన భూములను కోల్పోతున్నామని, ప్రభుత్వం ప్రస్తుతం ప్రకటించిన దానికన్నా అదనంగా మార్కెట్ రేటు ప్రకారం రైతులు పరిహారం చెల్లించాలని కోరారు. రూ.కోట్లు విలువ చేసే భూములకు ప్రభుత్వం కంటితుడుపుగా ఎకరానికి రూ.9లక్షల చొప్పున చెల్లిస్తామనడం ఎంతవరకు సమంజసమని రైతులు ప్రశ్నించారు. అనంతరం తమ డిమాండ్లను వినతిపత్రం రూపంలో అదనపు కలెక్టర్‌కు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతుల డిమాండ్లను కలెక్టర్‌కు అందించి అవసరమైన మేరకు కలెక్టర్‌తో సమావేశం ఏర్పాటుచేయిస్తానన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటస్వామి, ఎంపీడీవో శంకర్‌నాయక్, ఎంపీవో శ్రీనివాసులు, రైతులు నర్సింగం, దేవేందర్, కుమారస్వామి, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రీ స్కూల్ విద్యార్థులకు అక్షరాభ్యాసం



ప్రీ స్కూల్ విద్యార్థులకు అక్షరాలు దిద్దిస్తున్న టీచర్లు

నర్సంపేట, జూలై 20 : పట్టణంలోని రామాలయం వీధిలోని అంగన్‌వాడీ కేంద్రంలో ప్రీ స్కూల్ విద్యార్థులకు కొత్త పలకలు అందించి అక్షరాభ్యాసాన్ని నిర్వహించారు. అంగన్ వాడీ టీచర్ నల్ల భారతి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రంలో 35మంది పూర్వ ప్రాథమిక విద్యార్థులు ఉన్నారన్నారు. వీరికి ప్రభుత్వం అందించే యూనిఫామ్‌తోపాటు ఒక పూట భోజనం, గుడ్లు, స్నాక్స్ అందిస్తున్నామన్నారు. ఆటపాటల ద్వారా విద్యాబోధన చేస్తున్నామన్నారు. పాఠశాలకు అనుసంధానంగా ఉన్న అంగన్‌వాడీ కేంద్రం నుంచి ఈ సంవత్సరం ఒకటో తరగతిలో 15మంది పిల్లలను చేర్పించామన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శోభ, ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, రవీందర్, ఏఎల్ఎంఎస్‌సి సభ్యురాలు క్యాతం తేజశ్రీ, అంగన్‌వాడీ టీచర్ ఎండీ.గౌసియా, ఆయా సునీత, విద్యార్థుల తల్లులు హరిత, లక్ష్మీ, శ్వేత, అనిసా, కౌసర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు తప్పనిసరి



బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయుడు వీరన్నను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

నర్సంపేట, జూలై 20 : ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు తప్పనిసరి అని ఇటుకాల పల్లి కాంప్లెక్స్ హెచ్‌ఎం రమాదేవి, రాజుపేట స్కూల్ హెచ్‌ఎం మంగ్య అన్నారు. మండలంలోని గార్లగడ్డతండాలో కొన్నేళ్లుగా ఉపాధ్యాయుడిగా పనిచేసి బదిలీపై వెళ్తున్న దారావత్ వీరన్నను సన్మానించారు. పాఠశాల హెచ్‌ఎం అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ వీరన్న ఇంటింటికి తిరిగి విద్యార్థులను పాఠశాలలో చేర్పించడానికి తన వంతు కృషి చేశారన్నారు. విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించి వారిని చదువులో తీర్చిదిద్దారని పేర్కొన్నారు, కార్యక్రమంలో ఉపాధ్యాయులు దారావత్ రవి, రాధ, సాంబయ్య ఏఏపీసీ చైర్మన్ కమల, కోమల, మాజీ విద్యా కమిటీ చైర్మన్ భద్రు, మాజీ ఎంపీటీసీ వీరన్న, ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శి, సిబ్బంది పాల్గొన్నారు.

జీవన నైపుణ్యాలను పెంపొందించుకోవాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రధాన వక్త దామోదర్

నర్సంపేట టౌన్, జూలై 20 : విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, జీవన నైపుణ్యాలను పెంపొందించుకోవాలని పర్యావరణవేత్త, సీడబ్ల్యుసీ సభ్యుడు కె.దామోదర్ అన్నారు. నర్సంపేట మండలం గురిజాల హై స్కూల్‌లో ఓరుగల్లు సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, కన్స్యూమర్ ప్రొటెక్షన్ కౌన్సిల్ హన్మకొండ ఆధ్వర్యంలో శనివారం సంస్కార వికాస శిక్షణ కార్యక్ర మాన్ని పాఠశాల హెచ్‌ఎం రాంచందర్‌రావు అధ్యక్షతననిర్వహించారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పెద్దలు, గురువులు, దేశం, సమాజం పట్ల గౌరవ భావం కలిగి ఉండాలన్నారు. హైస్కూల్ దశలోనే ఉన్నత లక్ష్యాన్ని ఏర్పర్చు కొని లక్ష్యసాధన కోసం కృషిచేయాలన్నారు. రిటైర్డ్ డీఎస్పీ దామెర నర్సయ్య మాట్లా డుతూ చదువుకునే సమయంలో ఎదురయ్యే ఆటంకాలను, అవరోధాలను ఓపికతో అధిగమిస్తే ఉన్నత స్థాయికి చేరుకుంటారన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి తేరాల యుగేందర్, ఈగ సత్యనారాయణ, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి తల్లిదండ్రుల సహకారం అవసరం

చెన్నారావుపేట, జూలై 20 : ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి విద్యార్థుల తల్లిదండ్రుల సహకారం అవసరం ఉందని జిల్లా బాలిక విద్యాభివృద్ధి అధికారి ఫ్లోరెన్స్ అన్నారు. మండలంలోని ఉప్పరపల్లి ఉన్నత పాఠశాలలో శనివారం తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో కలిసి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచాలన్నారు. పాఠశాల, అభివృద్ధి పనుల పురోగతిని ఆమె పరిశీలించారు. ప్రతీ నెల మూడో శనివారం విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం జయ, అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ అధ్యక్షురాలు చింతకింది సుజాత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జోరందుకున్న వ్యవసాయ పనులు


వర్షాలతో నిండుతున్న చెరువులు, కుంటలు

పొలం పనుల్లో రైతులు బిజీబిజీ

వరంగల్ వ్యవసాయం, జూలై 20 : జిల్లాలో భారీ వర్షాలకు జలకళ ఉట్టిపడుతోంది. విస్తారంగా వర్షాలు కురుస్తుండటంతో వాగులు, వంకలు, చెరువులు, కుంటలు వరద నీటితో కళకళ లాడుతున్నాయి. జిల్లాలో ప్రధాన నీటి ప్రాజెక్టు పాకాల సరస్సులోకి ఇప్పటికే 20.9 అడుగుల మేర నీరు చేరింది. పెద్ద ఎత్తున జనాలు సరస్సు నీటిని చూసేందుకు చేరుకుంటున్నారు. మరో పక్క రైతులు పొలం పనుల్లో తీరిక లేకుండా ఉన్నారు. జిల్లాలో ముఖ్యంగా వరి, పత్తి, మిర్చి, మొక్కజొన్న, కంది, పల్లి పంటలు ఎక్కువగా సాగు చేస్తారు. ఇటీవల కురుస్తున్న వర్షాలు ఆయా పంటలకు అనుకూలంగా ఉండడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. బావుల కింద ఇప్పటికే వరినార్లు పోసుకోగా, చెరువులు, కుంటల కింద ఇప్పుడిప్పుడే నార్లు అలుకుతున్నారు. పత్తి పంటకు వర్షాలు చాలా వరకు ఉపయోగపడుతున్నాయి. మొత్తానికి వ్యవసాయ సాగు పనులు ఊపందుకున్నాయి.

నిండుతున్న పాకాల చెరువు

జిల్లాలో అతిపెద్ద పాకాల సరస్సు నీటి మట్టం 30 అడుగులు కాగా, భారీ వర్షాలకు ఇప్పటికే 20.9 అడుగులకు నీరు చేరింది. ఈ సరస్సు కింద సుమారు 30వేల ఎకరాలలో రైతులు వరి పంట సాగు చేస్తారు. భారీగా నీరు చేరుడంతో రైతులు పొలం పనుల్లో బిజీ అయ్యారు. వరి నార్లు



జలకళను సంతరించుకున్న పాకాల సరస్సు

పోస్తున్నారు. పొలాలు దున్నడం, గెట్లు పెట్టడం చేస్తున్నారు. కొందరు రైతులు నాట్లు కూడా వేస్తున్నారు.

సన్నాలకే ప్రాధాన్యత

కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక సన్నాలకు బోనస్ రూ.500 ప్రకటించడంతో రైతులు సన్నాలకే ప్రాధాన్యత ఇస్తున్నారు. జిల్లాలో సుమారు 1.30వేల ఎకరాలలో వరి సాగు చేయనున్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు. ఇందులో ఎక్కువ శాతం రైతులు సన్నాలు సాగు చేయడానికే ముందుకు సాగుతున్నారు. ధాన్యానికి కనీస మద్దతు ధర రూ.2,203 ఉండగా ఇటీవల కేంద్ర ప్రభుత్వం ధాన్యానికి కనీస మద్దతు ధర రూ.2,320లకు పెంచింది. ఈ ధరలు రానున్న సెప్టెంబరు నుంచి అమలులోకి రానున్నాయి. మద్దతు ధర రూ.2,320తోపాటు రాష్ట్ర ప్రభుత్వం అందించే రూ.500 బోనస్‌తో కలిపితే క్వింటా ధాన్యానికి రూ.2,820 పలుకుతుందని రైతులు లెక్కలేసుకుని సన్నవడ్లను సాగు చేసేందుకే ఇష్టపడుతున్నారు.

జిల్లాలో 24.9 మి.మీ వర్షపాతం నమోదు

వరంగల్ కలెక్టరేట్ : జిల్లాలో గత రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా ముసురు పడుతోంది. అక్కడక్కడా ఓ మోస్తరు వర్షం కురిసింది. గత 24 గంటల్లో జిల్లాలో 24.9 మి.మీ వర్షపాతం నమోదైంది. వరంగల్ జిల్లాలోని మొత్తం 13 మండలాల్లో కలిపి 323.6 మి.మీ వర్షం కురిసినట్లు వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. దాదాపు అన్ని మండలాల్లో ఒకేలా 22 మి.మీ నుంచి 28 మి.మీ మధ్య వర్షం కురిసింది. ఖానాపూర్ మండలంలో కాస్త ఎక్కువ వర్షం పడింది. మిగతా మండలాలలో సాధారణ వర్షపాతం నమోదైంది. గీసుగొండలో 25.6 మి.మీ, దుగ్గొండిలో 26.2 మి.మీ, నల్లబెల్లిలో 22.4 మి.మీ, నర్సంపేటలో 24.6 మి.మీ, ఖానాపూర్‌లో 28.4 మి.మీ, చెన్నారావుపేటలో 25.4 మి.మీ, సంగెంలో 23 మి.మీ, వర్ధన్నపేటలో 26.4 మి.మీ, రాయపర్తిలో 16.8మి.మీ, పర్వతగిరిలో 23.8 మి.మీ, నెక్కొండలో 26.4 మి.మీ, ఖిలా వరంగల్‌లో 28.2 మి.మీ, వరంగల్‌లో 26.4 మి.మీ వర్షం పడినట్టు అధికారులు తెలిపారు. రానున్న రెండు రోజులు కూడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్టు వాతావరణ శాఖ అధికారులు హెచ్చరించారు.

వర్షాలతో అప్రమత్తంగా ఉండాలి



వర్ధన్నపేటలో వార్డు అధికారులతో మాట్లాడుతున్న మునిసిపల్ కమిషనర్ జోనా

వర్ధన్నపేట, జూలై 20 : ఎడతెరిపి లేకుండా అకాల వర్షాలతో అధికారులు, ఎమర్జెన్సీ టీం సభ్యులు నిత్యం అప్రమత్తంగా ఉండాలని వర్ధన్నపేట మునిసిపల్ కమిషనర్ ఇస్సంపెల్లి జోనా అన్నారు. వాతావరణంలో వస్తున్న మార్పులతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మునిసిపాలిటీలో వార్డు అధికారులు, సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మునిసిపాలిటీ పరిధిలోని 12వార్డుల్లో నాలాలు, గుంతలను, శిథిలావస్థలో ఉన్న గృహాలు, మట్టిగోడలను ఎప్పటికప్పుడు తొలగించాలని ఆదేశించారు. మరో ఐదు రోజులపాటు వర్షాలు ఉన్నందున అధికారులు, సిబ్బందితో రెండు అత్యవసర బృందాలను ఏర్పాటు చేశామన్నారు. వర్షాప్రభావంతో మునిసిపాలిటీ పరిధిలో ఎక్కడ సమస్య ఉన్నా ప్రజలు బృందం సభ్యులైన కాసర్ల అయిలయ్య 7981904968, గిర్ర శంకర్ 9573825978, ఎలక్ట్రీషియన్ మల్లెపాక బాబు 9912436457, బిల్ కలెక్టర్లు తుమ్మల విజయ్ కుమార్ 9063148490, విలసారపు కుమారస్వామి 9392031476లకు సమాచారం అందిస్తే సమస్యను పరిష్కరిస్తారని కమిషనర్ పేర్కొన్నారు. సమావేశంలో ఇన్‌చార్జ్ మేనేజర్ కొలిపాక కిరణ్, ఇన్‌చార్జ్ ఆర్ఐ గోక శ్రవణ్‌కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ కాసర్ల అయిలయ్య, హరిత హారం ఇన్‌చార్జ్ గిర్ర శంకర్, వార్డు అధికారులు అశోక్, సూర్య, అవినాశ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● నల్లబెల్లి: రానున్న రెండు రోజుల్లో వర్షాలు ఎక్కువగా ఉన్నాయని వాతావరణ శాఖ తెలిపిందని, నల్లబెల్లి మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై టి.ప్రశాంత్‌బాబు తెలిపారు. ఈ మేరకు శనివారం పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులు విద్యుత్ తీగల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. పొలాలు, ఇళ్లలో తడిసిన తీగలతో అప్రమత్తంగా ఉండాలన్నారు. పాత ఇల్లు కూలే దశలో ఉంటే వెంటనే ఆ ఇంటి నుంచి బయటకు వెళ్లాలని తెలిపారు.వాగులు, వంకలు పొంగుతున్నందున రైతులు, వాహదారులు రాకపోకలకు జాగ్రత్త వహించాలని పేర్కొన్నారు.

● దుగ్గొండి : భారీ వర్షాల దృష్ట్యా వాతావరణం శాఖ హెచ్చరికలు ప్రకటించినందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై నీలోజు వెంకటేశ్వర్లు ప్రజలకు సూచించారు. మండలంలోని వివిధ గ్రామాల్లోని వాగులను శనివారం ఎస్సై సందర్శించి మాట్లాడారు. విద్యుత్ పోల్స్, తీగలు, చెట్లు కింద ఉండరాదని, ప్రవహించే వాగులు దాటకూడదని శిథిలావస్థలో ఉన్న ఇళ్లలో నివసించరాదన్నారు. అత్యవసర పనులు ఉంటనే ప్రయాణం చేయాలని పేర్కొన్నారు. అధికారుల సూచనలు పాటించి వర్షాలతో వచ్చే ప్రమాదాల నుంచి రక్షణ పొందాలన్నారు.

● రాయపర్తి : వర్షాకాలంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఇన్‌చార్జ్ డీపీవో రాంరెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలో పర్యటించి, పలు సూచనలు చేశారు. అనంతరం గ్రామ పంచాయతీని సందర్శించి, రికార్డులను తనిఖీ చేశారు. వర్షాల సందర్భంగా ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. సీజనల్ వ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. ప్రజాపాలన దరఖాస్తులను సైతం తీసుకుని ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదుచేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో కిషన్ నాయక్, కార్యదర్శి అశోక్ పాల్గొన్నారు.

● పర్వతగిరి: వర్షాలపట్ల అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో శంకర్‌నాయక్ అన్నారు. శనివారం మండలపరిషత్ కార్యాలయంలో ఆయా గ్రామాలకు చెందిన పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పిచ్చిమొక్కలు లేకుండా చూడాలని, నీటి గుంతలను గుర్తించి పూడ్చివేయాలన్నారు. పైపులైన్ లీకేజీలను గుర్తించాలని, మురుగునీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలన్నారు. వాటర్ ట్యాంక్‌ల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని, ట్యాంకులను శుభ్రం చేయించాలన్నారు. వర్షాకాలం దృష్ట్యా ఈగలు, దోమలు ప్రబలకుండా బ్లీచింగ్ పౌడర్ చల్లించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో పాక శ్రీనివాసులు, ఆయా గ్రామాల కార్యదర్శులు పాల్గొన్నారు.

వర్షాకాలం వేళ విద్యుత్ ప్రమాదాలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని విద్యుత్ ఏడీఈ చంద్రమౌళి శనివారం ఒక ప్రకటనలో ప్రజలను కోరారు. తడిసిన విద్యుత్‌స్థంభాలను ముట్టుకోవద్దని, తడిసిన చేతులతో స్టార్టర్లు, మోటార్లు ముట్టుకోవద్దన్నారు. వర్షం పడేటప్పుడు టీవీ, ఫ్రిడ్జ్, కంప్యూటర్ తదితర ఉపకరణాలను స్విచ్ ఆఫ్ చేయాలన్నారు. కరెంటు లైను కింద సెల్‌ఫోన్ మాట్లాడకూడదని, ఇంట్లోకి వచ్చే సర్వీస్‌వైరు డ్యామేజ్ అయితే వెంటనే విద్యుత్ సిబ్బంది దృష్టికి తీసుకెళ్లాలని ఆ ప్రకటనలో ఆయన తెలిపారు.

50 లీటర్ల గుడుంబా పట్టివేత

దుగ్గొండి, జూలై 20 : మండల కేంద్రంలోని శివారులో 50 లీటర్ల గుడుంబా పాకెట్లను శనివారం సాయంత్రం పోలీసులుపట్టుకున్నారు. ఎస్సై నీలోజు వెంకటేశ్వర్లు కథనం ప్రకారం... నల్లబెల్లి మండలంలోని రేలకుంట తండాకు చెందిన గుగులోతు రాజు అక్రమంగా 50 లీటర్ల గుడుంబాను పాకెట్లలో నింపి వరంగల్‌కు రవాణా చేయడానికి దుగ్గొండి శివారు లక్ష్మీపురం రోడ్డు పక్కన ఆటోకోసం చూస్తుండగా, పోలీసులు పెట్రోలింగ్‌చేస్తున్న క్రమంలో రాజు పారిపోతుండగా పట్టుకొని గుడుంబా స్వాధీనం చేసుకొని, నిందితుడిని అదుపులోకి తీసుకొని కేసునమోదు చేశారు.

అక్రమ అరెస్టులతో ప్రశ్నించే గొంతుకలను ఆపలేరు

నల్లబెల్లి, జూలై 20 : అక్రమ అరెస్టులతో ప్రశ్నించే గొంతుకలను ఆపలేరని బీజేవైఎం మండల అధ్యక్షుడు సుధకాని ప్రమోద్‌గౌడ్ అన్నారు. హైదరాబాద్‌లోని ధర్నా చౌక్‌లో భారతీయ యువమోర్చా చేపట్టిన మహాధర్నా కార్యక్రమానికి ప్రమోద్‌గౌడ్ ఆధ్వర్యంలో ధర్నా చౌక్‌కు వెళ్తారనే ముందస్తు సమాచారంతో శనివారం పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ప్రమోద్‌గౌడ్ మాట్లాడారు. బీజేవైఎం తరఫున నిరంతరం పోరాటం చేస్తూనే ఉంటామని తెలిపారు. బీజేవైఎం నాయకులు తడక వినయ్, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రగతికి సహకరించండి

దుగ్గొండి, జూలై 20 : విద్యార్థుల ప్రగతికి తల్లిదండ్రులు సహకరించాలని దుగ్గొండి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎ.రామస్వామి సూచించారు. మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో శనివారం విద్యార్థుల తల్లి దండ్రులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత గురువులపై ఉందని, దానికి పేరెంట్స్ పూర్తి స్థాయిలో మద్దతు తెలపాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలోనే మెరుగైన బోధన ఉంటుందని, అనుభవం కలిగిన ఉపాధ్యాయులు బోధన చేస్తారన్నారు. ప్రతీ రోజు విద్యార్థులను బడికి పంపించాలన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు కవిత, శ్రావణి, అక్బర్‌పాష, సునిత, స్వప్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కిరాణం డబ్బాలో చోరీ

చెన్నారావుపేట, జూలై 20: మండలంలోని పాతమగ్దుంపురంలో ఓ కిరాణం డబ్బా లో చోరీ జరిగిన సంఘటన శనివారం వెలుగు చూసింది. గ్రామస్థుల కథనం ప్రకారం... ఇదే గ్రామానికి చెందిన పటాన్ నాగులు కిరాణ దుకాణం పెట్టుకొని జీవనం సాగిస్తున్నారు. రోజు వారి మాదిరిగానే కిరాణం సామాను అమ్మినంతరం డబ్బాకు తాళం వేసి వెళ్లాడు. శుక్రవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు డబ్బా వెనకాల భాగంలో రంధ్రంచేసి డబ్బాలో ఉన్న నగదు రూ.10వేలతో పాటు వస్తువులను అప హరణ చేశారు. ఈ విషయమై బాధితుడు నాగులు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

వర్ధన్నపేటలో చిరు జల్లులు

వర్ధన్నపేట, జూలై 20 : వర్ధన్నపేట పట్టణంలో శుక్రవారం మధ్యాహ్నం నుంచి శనివారం సాయంత్రం వరకు ఎడతెరిపి లేకుండా చిరుజల్లులు కురిశాయి. వర్షాకాలం ప్రారంభమైన నాటి నుంచి నేటివరకు భారీ వర్షాలుకురవలేదు. చెరువులు, కుంటల్లో కనీసం మట్టిబొందలు సైతం నిండలేదు. వర్షాకాలం ప్రారంభం నుంచి చిరుజల్లులు కురియడంతో మెట్టపంటలకు ఆశాజనకంగా ఉంది. వర్షాలు కురవక పోవడంతో వరినాట్లు నామమాత్రంగానే వేశారని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. శుక్రవారం నుంచి కురుస్తున్న వర్షాలతో ఆ నీటిని నిలిపి వరిపంటలకు దుక్కులు చేసుకుంటున్నారు.

ఉప్పరపల్లిలో సైడ్ కాల్వల నిర్మాణం చేపట్టాలి



ఇళ్ల మధ్యలో నిలిచిన వరద నీరు

చెన్నారావుపేట, జూలై 20 : మండలంలోని ఉప్పరపల్లి గ్రామంలో సైడ్ కాల్వలు లేక ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల గ్రామంలో నూతనంగా సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టి సైడ్ కాల్వల నిర్మాణం మాత్రం చేపట్ట లేదు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో గ్రామస్థులు వరద నీటితో ఇబ్బందులు పడతున్నారు. రోడ్డు నిర్మాణంతో పాటు సైడ్ కాల్వల నిర్మాణం చేస్తే బాగుండేదని గ్రామస్థులు వాపోవుతున్నారు. కాగా, కలామ్స్ ఫౌండేషన్ సభ్యులు వరద నీరు చేరిన ఇండ్ల బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో పరికి మధుకర్, పోగుల అశోక్, ఉడ్గుల రాజు కుక్కల రాజు. సతీష్, రాజ, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్యపరీక్షలు చేయాలి

చెన్నారావుపేట, జూలై 20: గర్భిణులకు వైద్య పరీక్షలు చేయాలని ప్రాజెక్టు ఆఫీసరు డాక్టర్ పద్మశ్రీ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆశ కార్యకర్తలు నిరంతరం గ్రామాల్లో పర్యటన చేయాలన్నారు. గర్భిణుల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. ప్రతీ రోజు వైద్య పరీక్షలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సరోజ, సహజ, భవాని, కాంతి, సరిత, రాజకుమారి, శ్వేత తదితరులు పాల్గొన్నారు.

ఇల్లందలో అలరించిన మాక్ పోలింగ్

వర్ధన్నపేట రూరల్, జూలై 20 : మండలంలోని ఇల్లంద గ్రామ ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన ఎన్నికల మాక్ పోలింగ్ కార్యక్రమం శనివారం అందరినీ అలరించింది. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు విలువను తెలియచేస్తూ విద్యార్థులు పోలింగ్ కార్యక్రమాన్ని, అభ్యర్థుల ప్రచారాలను కండ్లకు కట్టినట్లు చూపించారు. మాక్ పోలింగ్ ఎన్నికల్లో ఏడుగురు విద్యార్థులు పోటీ చేయగా పదో తరగతికి చెందిన మునుకుంట్ల సాత్విక అత్యధిక మెజార్టీతో గెలుపొందింది. బ్యాలెట్ బాక్స్ ద్వారా నిర్వహించిన ఎన్నికల సరళిలో అభ్యర్థులకు గుర్తులను సైతం కేటాయించి ఓటు హక్కు వినియోగించుకునేలా ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం విజయ, ఉపాధ్యాయులు కృష్ణ, సర్వాన్ తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ బోధనతో విద్యార్థులకు సులభంగా అర్థం

నెక్కొండ, జూలై 20 : డిజిటల్ విద్యా బోధనలతో విద్యార్థులకు సులభంగా పాఠ్యంశాలు అర్థమవుతాయని అప్పల్‌రావుపేట హైస్కూల్ హెడ్మాస్టర్ రవీందర్ అన్నారు. హై స్కూల్‌లో ఏర్పాటు చేసిన డిజిటల్ బోధనలను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ డిజిటల్ పద్ధతి ద్వారా ఉపాధ్యాయులు అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి 8 నుంచి 10వ తరగతి విద్యార్థలకు విద్యా బోధనలు చేస్తారన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రావన్‌కుమార్, రవీంద్రనాథ్, గీత, యాదలక్ష్మీ, భూలక్ష్మీ, వెంకట్రాజం, రమేశ్, గ్రామస్థులు సురేష్, వెంకటేశ్వర్లు, భవాని, యాకయ్య, మహేశ్వరి, జ్యోతి, సూరయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

బెల్టుషాపులకు మద్యం సరఫరా



బెల్టుషాపులకు తరలిస్తున్న మద్యం బాటిళ్లు

పర్వతగిరి, జూలై 20 : మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన వైన్‌షాపు నిర్వాహకులు బెల్టుషాపులకు విచ్చలవిడిగా మద్యం సరఫరా చేస్తున్నారు. ఏకంగా ఆటోలో మద్యం పెట్టెలను బెల్టుషాపులకు డోర్ డెలివరీ చేస్తున్నారు. మండల పరిధిలోని గ్రామాల్లో ఆరు మద్యం దుకాణాలు ఉండగా, ఒక్కోదుకాణం పరిధిలోని బెల్టుషాపులకు ఆయాషాపుల నుంచి యథేచ్ఛగా మద్యం సరఫరా చేస్తున్నారు. కాగా, మండల కేంద్రం నుంచి కొంకపాక గ్రామంలోని బెల్టు షాపులకు మద్యం బాటిళ్లను శనివారం ఆటోలో తరలించారు. వైన్‌షాపుల నుంచి బెల్టు షాపులకు ఎమ్మార్పీ కన్నా ఎక్కువ ధరలకు విక్రయిస్తుండ డంతో ఇదే ఆసరాగా చేసుకుని బెల్టుషాపుల నిర్వాహకులు మరింత ఎక్కువ ధరలకు మద్యాన్ని విక్రయిస్తున్నారు. ఇదంతా ఎక్సైజ్‌శాఖ అధికారులకు తెలిసే జరుగుతుందని పలు గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. మద్యంషాపుల ద్వారా ఎమ్మార్పీకి కేవలం వినియోగదారులకే మద్యం విక్రయించాలని, బెల్టుషాపులకు విక్రయి స్తున్న వైన్‌షాపులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

ఎమ్మెల్యేను కలిసిన తిమ్మంపేట కాంగ్రెస్ నూతన కమిటీ



ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డిని కలిసిన తిమ్మంపేట గ్రామ కమిటీ సభ్యులు

దుగ్గొండి, జూలై 20 : మండలంలోని తిమ్మంపేట కాంగ్రెస్ గ్రామ కమిటీ సభ్యులు, సీనియర్ నాయకులు శనివారం ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డిని హనుమకొండలోని నివాసంలో కలుసుకొని గ్రామాభివృద్ధికి సహకరించాలని కోరారు. గ్రామ కమిటీని ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ తిమ్మంపేట ఎమ్మెల్యే, ఎంపీ ఎన్నికల్లో అధిక మెజార్టీని ఇచ్చిన గ్రామంగా గుర్తింపు ఉందని, గ్రామాభివృద్ధికి పాటుపడతానన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకొనిపోవాలని పిలుపు నిచ్చారు. పార్టీ కోసం పనిచేసే కార్యకర్తలకు అండగా ఉండడంతోపాటు వారికి పదవుల్లో తగు న్యాయం చేస్తామన్నారు. ఎమ్మెల్యేను కలసిన వారిలో గ్రామ అధ్యక్షుడు రొట్టె రమేశ్, ప్రధాన కార్యదర్శి కొలిపాక భాస్కర్, సినియర్ నాయకులు సౌదారపు బాలయ్య, బొనగాని ఆగయ్య పెండ్యాల సాంబయ్య, గిన్నె స్వామి, గ్రామ కమిటీ సభ్యులు దాసి నవీన్, కె.భాస్కర్, కొలిపాక వెంకటేశ్వర్లు, దండు శ్రీనివాస్, నిరంజన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

నేడు భద్రకాళికి శాకంబరీ అలంకరణ

పది టన్నుల కూరగాయలు, పండ్లు వినియోగం

ఆలయంలో పూర్తి ఏర్పాట్లు చేసిన అధికారులు

వరంగల్ కల్చరల్, జూలై 20 : వరంగల్ నగరంలో కొలువుదీరిన భద్రకాళి అమ్మవారి ఆలయంలో శాకంబరీ ఉత్సవాలు ఎంతో వైభవంగా జరుగుతున్నాయి. 16 రోజుల పాటు జరిగే వేడుకల్లో ఆఖరి రోజు ఆదివారం పౌర్ణమి సందర్భంగా ఆషాఢ శుద్ధ పౌర్ణమి శాకంబరీ అలంకరణ అత్యంత వైభవోపేతంగా జరుగుతుంది. దేశ నలుమూలల నుంచి తెప్పించిన కూరగాయలు, ఆకు కూరలు, పండ్లతో అమ్మవారిని శాకంబరీగా అలంకరించి పూజలు నిర్వహించి భక్తుల దర్శనానికి ఏర్పాట్లు చేస్తారు. దాదాపు లక్ష మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుంటారని ఆలయ వర్గాలు అంచనా వేశాయి. ఇందుకు గాను అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

10 టన్నుల కూరగాయలతో అలంకరణ

భద్రకాళి అమ్మవారిని శాకంబరీగా అలంకరణ చేసేందుకు 10 టన్నుల కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు వినియోగించనున్నారు. దీంతో ప్రకృతి మాతగా అమ్మవారు దర్శనమిస్తారు. దాతలు, భక్తుల నుంచే కాకుండా దేవాలయం నుంచి కూడా కూరగాయలు కొనుగోలు చేసి అలంకరిస్తారు. అమ్మవారిని అలంకరించడానికి శనివారం రాత్రి నుంచే అర్చక బృందం కార్యక్రమాన్ని ప్రారంభించింది. సేవా సమితికి చెందిన 200మంది మహిళలు సాయంత్రం 5గంటల నుంచి కూరగాయలను మాలలుగా తయారు చేయడం ప్రారంభించారు. ఆదివారం ఉదయం వరకు అలంకరణ పూర్తయి మహా మంగళహారతి అనంతరం భక్తుల దర్శనానికి ఏర్పాట్లు చేస్తున్నారు.



దేవాలయంలో అమ్మవారి శాకంబరీ అలంకరణకు కూరగాయలను దండగా తయారుచేస్తున్న సేవా సమితి మహిళలు

నాలుగు రకాల దర్శనాలు

అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు నాలుగు రకాలుగా దర్శనం ఏర్పాట్లను దేవాలయ సిబ్బంది ఏర్పాటు చేస్తున్నారు. ఉచితంగా ధర్మ దర్శనం, రూ.50 టికెట్‌తో శీఘ్ర దర్శనం, రూ.100తో అతి శీఘ్ర దర్శనంతో పాటు వీఐపీల దర్శనానికి ఏర్పాట్లు చేస్తున్నారు. అలాగే శనివారం శాకంబరీ అలంకరణ కోసం మహబూబాబాద్ జిల్లాకు చెందిన లక్ష్మీ వేంకటేశ్వర సేవా సమితికి చెందిన 2,500 మంది భక్తులు వరంగల్ పోచమ్మమైదాన్ నుంచి భద్రకాళి అమ్మవారి ఆలయం వరకు శనివారం కూరగాయలతో ర్యాలీ నిర్వహించారు. ఆదివారం శాకంబరీ సందర్భంగా అమ్మవారి అలంకరణ కోసం ప్రతి ఒక్కరూ కొన్ని కూరగాయలతో ర్యాలీగా వచ్చి దేవస్థానం వద్ద ప్రధానార్చకులు భద్రకాళి శేషు, ఈవో శేషు భారతికి అందించారు.

ఉచితంగా ప్రసాద వితరణ

అమ్మవారి దర్శనానికి తరలివచ్చే వేలాది మంది భక్తులకు ఉచితంగా ప్రసాదాన్ని అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. వరంగల్‌లోని భద్రకాళి సేవా సమితి అధ్యక్షుడు ఐత గోపీనాథ్ ఆధ్వర్యంలో 6.5 క్వింటాళ్ల ప్రసాదాన్ని తయారుచేసి ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులకు అందజేయనున్నారు. ఆలయంలో విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి భోజనాలకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఆలయ సిబ్బంది, పోలీసులతో పాటు 200 మంది సేవా సమితి వలంటీర్లను భక్తులకు సేవలందించడానికి వినియోగిస్తున్నట్లు ఈవో శేషు భారతి తెలిపారు.